



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur
RNI No.52722/90 సంపుటి: 38 సంచిక : 140 విశాఖపట్నం, 08 మార్చి 2026 ఆదివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

# భవిష్యత్‌లో అనేక దేశాలకు

## మన విద్యుత్ : చంద్రబాబు



**దిల్లీ:** అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళ్తున్నట్లు చెప్పారు.

" ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోంది. మన దేశం భవిష్యత్‌లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్‌లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే ⏭ తరువాయి 2లో..

# బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం.. రాష్ట్రపతి అసహనం



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అసహనం వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ.. మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఆదివాసీ సదస్సుకు అనుమతి ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించారు. అయినప్పటికీ మమత ప్రభుత్వంపై ఎటువంటి ద్వేషం లేదని..ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగుడికి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి గానీ ప్రభుత్వంలోని సీనియర్ ⏭ తరువాయి 2లో..

# పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయింది: ట్రంప్



**అమెరికా :** దాడుల విషయంలో గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పిన వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పశ్చిమాసియాలో ఓటమి పాలైన దేశంగా ఇరాన్‌ను పేర్కొన్నారు. ఆ దేశం దాని పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి లొంగిపోయిందన్నారు. ఇకపై దాడులు చేయబోమని కూడా హామీ ఇచ్చిందని గుర్తుచేస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పశ్చిమాసియాను ఇరాన్ ఇక బెదిరించలేదని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. "పశ్చిమాసియాను ⏭ తరువాయి 2లో..

## అక్రమ మద్యం..

# మౌనమే జగన్ సమాధానమా?: నారా లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 7 :** గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం వేల కుటుంబాలను నాశనం చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అక్రమ మద్యం ద్వారా జగన్ అనుచరుల జేబుల్లో రూ.వేల కోట్లు చేరాయని ఆరోపణలు వచ్చాయన్నారు. రూ.కోట్ల నగదు లావాదేవీలకు సంబంధించి ఈడీ ఆధారాలను బయటపెట్టినట్లు గుర్తు చేశారు. ఈ ఆరోపణలపై ఏపీ ప్రజలకు జగన్ సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. 'సమాధానం చెప్పలేక.. మౌనమే జగన్ సమాధానమా' అని అన్నారు. ఇదేనా జగన్ 2019లో నిషేధం అమలు చేస్తానన్న హామీ వెనుక అసలు కథ అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు.

# తెలంగాణ గడ్డపై హింసకు తావులేదు: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్:** తెలంగాణ గడ్డపై హింసకు తావులేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హింసాత్మక చర్యల ద్వారా ఏమీ సాధించలేరని చెప్పారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా పోలీసులు కృషి చేశారని, మావోయిస్టుల్లో ఒక నమ్మకాన్ని కలిగించారని కితాబిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మొత్తం 130 మంది మావోయిస్టులు సీఎం సమక్షంలో ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం మీడియాతో మాట్లాడారు. "అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనది. హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదని గాంధీ చాటి చెప్పారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయి. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసురావాలి. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేసింది. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని వాళ్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మేము చేయగలిగింది చేస్తామని చెప్పాను. మావోయిస్టు నేతల డిమాండ్లను కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చర్చించాను. లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా సూచించారు. ఆయనతో చర్చల తర్వాత మావోయిస్టు నేతలతో మళ్లీ చర్చించాను. మా చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదు. మావోయిస్టు పార్టీ సుప్రీం ముప్పాళ్ల లక్ష్మణరావు ఎలియాస్ ⏭ తరువాయి 2లో..

# విజయవాడలో పోలీసులపైకి కాల్పుల యత్నం



**విజయవాడ, విశాఖ సమాచారమ్, మార్చి 7 :** పోలీసులు కార్డన్‌సెర్చ్ చేస్తుండగా దుండగుడు పోలీసులపైకి కాల్పులకు యత్నించాడు. ఈ ఘటన విజయవాడ నగరంలో చోటుచేసుకుంది. బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో దుండగుడు.. పోలీసులు, ఈగల్ టీమ్ అధికారులపైకి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. అనంతరం పారిపోతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని తెలంగాణలోని వరంగల్‌కు చెందిన మురళిగా గుర్తించారు. ట్రిగ్గర్ ప్రెస్ చేయకపోవడంతో బుల్లెట్ ఛాంబర్‌లోకి రాలేదని పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'లో భాగంగా పోలీసులు, ఈగల్ టీమ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



# గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు

**ఇరాన్ :** అమెరికా- ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఆయన ఓ వీడియోలో మాట్లాడారు.

ఈ సందర్భంగా గల్ఫ్ దేశాలపై ఇకపై ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ ప్రకటించారు. అయితే, పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం.. స్పందించే హక్కు తమకు ఉందన్నారు. ఈ మేరకు దేశ తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల తాము దాడులు చేసిన దేశాలకు క్షమాపణలు కూడా చెప్పారు. వాటిపై దాడులు చేయడం తమ ఉద్దేశం కాదన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, పెజెష్కియాన్ దీన్ని తోసిపుచ్చారు. ఇరాన్‌ను లొంగదీసుకోవాలన్న కలలను వారు సమాధి చేసుకోవాల్సిందేనని వ్యాఖ్యానించారు.

# చిరుకు పవన్ కల్యాణ్ అభినందనలు

## గద్దర్ అవార్డుల్లో ఈటీవీ విన్ సత్తా

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 7 :**

అగ్ర కథానాయకుడు చిరంజీవి మరో గౌరవాన్ని అందుకోనున్నారు. తాజాగా గద్దర్ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారం వరించింది. దీంతో ఆయనకు అభినందనలు చెబుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్ట్ పెట్టారు. ఈ వార్త తనకెంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. గద్దర్ అవార్డులకు ఎంపికైన ప్రతి ఒక్కరికీ పవన్ శుభాకాంక్షలు తెలిపారు.

**దుల్ల కొట్టావ్ నాన్న: నాగార్జున**

ఇక ఈ అవార్డు విజేతలకు అగ్ర కథానాయకుడు నాగార్జున కూడా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తన కుమారుడు నాగచైతన్యను ప్రత్యేకంగా అభినందించారు. చైతూ ఉత్తమ నటుడిగా ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. 'తండేల్' సినిమాలో అద్భుతంగా ⏭ తరువాయి 2లో..






# ఆపరేషన్ 'వజ్ర ప్రహార్' ఏపీ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 7 :** ఏపీ వ్యాప్తంగా పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. పలు జిల్లాల్లో వందకు పైగా బృందాలతో సోదాలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. నివాస ధ్రువీకరణ పత్రాలనూ తనిఖీ చేస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, గంజాయి విక్రయాలపై దృష్టి సారించారు. ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'లో భాగంగా ⏭ తరువాయి 2లో..

# ఇరాన్ యుద్ధ నౌకపై యూఎస్ దాడి

## జైశంకర్ కీలక వ్యాఖ్యలు



**అమెరికా :** శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్-దేనాపై దాడి చేసిన అమెరికా జలాంతర్గామి దానిని ముంచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. ఇటీవల విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలు అనుకోని విధంగా యుద్ధ ప్రభావానికి గురయ్యాయని అన్నారు. ఆ నౌకల ప్రయాణ ఉద్దేశం వేరైనా.. ఉద్రిక్త పరిస్థితుల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

అదే సమయంలో ఐరిస్ లావన్ అనే మరో నౌక తిరిగి వెళ్తుండగా అందులో సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు. దీంతో కొచ్చిలో నౌక అత్యవసర నిలుపుదలకు ఇరాన్ విజ్ఞప్తి చేసిందన్నారు. ఈ విషయంలో చట్టపరమైన సమస్యలు ఉన్నప్పటికీ.. మానవతా దృక్పథంతో భారత్ ఈ నెల 1న సంబంధిత అనుమతి మంజూరు చేసిందన్నారు. దీంతో ⏭ తరువాయి 2లో..

# గౌరవ వేతనాలు పెంచాలి ఎంపీపీల సంక్షేమ సంఘం

**పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో ఎంపీపీలు, ఎంపీటీసీల నిరసన**

**తాడేపల్లి, విశాఖ సమాచారమ్, మార్చి 7 :** స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాలు పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎంపీపీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. తమ డిమాండ్ల సాధన కోసం ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. పంచాయతీరాజ్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. దీంతో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఎండలో గేటు ముందు బైఠాయించారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి అస్వస్థతకు గురికాగా వైద్యశాలకు తరలించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంపీపీల గౌరవ వేతనాన్ని రూ.6వేల నుంచి రూ.25వేలకు, ఎంపీటీసీలకు రూ.3వేల నుంచి రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎంపీపీల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మేకల హనుమంతరావు మాట్లాడుతూ.. ఎంపీపీలకు 20 నెలలుగా పంచాయతీరాజ్ మంత్రిని కలిసే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు.

# 6వేల కోట్లు: సుందర్ పిచాయ్ వేతన ప్యాకేజీని పెంచిన గూగుల్




**అమెరికా :** గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వేతన ప్యాకేజీ భారీగా పెరిగింది. రానున్న మూడేళ్ల కాలానికి ఆ మొత్తాన్ని 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ నిర్ణయం తీసుకుంది. అంటే భారత కరెన్సీలో అక్షరాలా రూ.6,361కోట్లు. ఈ మేరకు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది.

ఈ వేతన ప్యాకేజీలో వార్షిక జీతం 2 మిలియన్ డాలర్లు కాగా.. పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ విలువ 126 మిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నదాని ఆధారంగా ఈ మొత్తం సర్దుబాటు అవుతుంది. పరిమిత స్టాక్ వెస్టింగ్ ద్వారా 84 మిలియన్ల డాలర్లను అందుకుంటారు. పరిమిత స్టాక్ వెస్టింగ్ అంటే.. కంపెనీ ఉద్యోగికి మంజూరు చేసే షేర్లు. పదవీకాలం పూర్తయిన లేదా పనితీరు ఆధారంగా ఇవి ఉద్యోగికి బదిలీ అవుతుంటాయి. అలాగే ఆల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యేమో, వింగ్ ఏవియేషన్లలో 175 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కేటాయించారు. ఈ రెండు సంస్థలకు సుందర్ పిచాయ్ నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి ఈ ప్రోత్సాహకాలు నిదర్శనమని ఆల్ఫాబెట్ బోర్డు వెల్లడించింది. ఏఐతో టెక్ ప్రపంచం వేగంగా మారుతున్న క్రమంలో పిచాయ్‌పై బలమైన నమ్మకంతో కంపెనీ ఈ వేతన పెంపును ప్రకటించింది.

2004లో గూగుల్‌లో చేరిన సుందర్ పిచాయ్.. 2015లో సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ దశాబ్దకాలంలో ఆ సంస్థ మార్కెట్ విలువ ఏడు రెట్లు పెరిగింది. 535 బిలియన్ డాలర్ల నుంచి 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఈ జనవరిలో ఒక దశలో 4 ట్రిలియన్ల డాలర్ల మార్క్‌ను తాకింది.

# భారీగా పెరిగిన వంట గ్యాస్ ధరలు



**ఢిల్లీ:** దేశంలో వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. గృహవినియోగ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ.115 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. దీంతో హైదరాబాద్‌లో ఎల్పీజీ సిలిండర్ ధర రూ.965కి చేరింది. ఉజ్వల్ పథకం ద్వారా అందించే సిలిండర్ ధరల్లో మార్పు లేదని చమురు సంస్థలు స్పష్టం చేశాయి. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలోనే ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.

**ప్రధాన నగరాల్లో కొత్త ధరలు ఇలా..**
(గృహ వినియోగ సిలిండర్..14.2కేజీ)
ఢిల్లీ - రూ.913
ముంబయి - రూ 912.50
కోల్‌కతా - రూ. 939
చెన్నై - రూ.928.50
హైదరాబాద్- రూ.965
**వాణిజ్య సిలిండర్ ధరలు ఇవి (19కేజీ)..**
ఢిల్లీ - రూ.1883
ముంబయి - రూ.1835
కోల్‌కతా - రూ.1990
చెన్నై - రూ.2043

# వైకాపాకు సేవతో ఆర్టీసీకి రూ.3.23 కోట్ల నష్టం బయటపెట్టిన కాగ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 7 :**
వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ప్లీనరీకి, బీసీల సభకు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సులను వినియోగించగా.. వాటికి పూర్తిస్థాయిలో అద్దె చెల్లించకుండా రాయితీలు పొందినట్లు బయటపడింది. దీనివల్ల ఆర్టీసీ రూ.1.66 కోట్ల మేర నష్టపోగా, జీఎస్టీ వసూలు చేయకపోవడంతో ప్రభుత్వం రూ.1.57 కోట్లు కోల్పోయింది. శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టిన కాగ్ నివేదికలో ఈ విషయాలు వెలుగుచూశాయి. 2022 జులైలో గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం మైదానంలో నిర్వహించిన పార్టీ ప్లీనరీకి వైకాపా వివిధ జిల్లాల నుంచి 1,823 ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంది. వీటికి ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయాల్సి ఉండగా ఆర్టీసీ అధికారులు సాధారణ ఛార్జీలే వసూలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 10 శాతం రాయితీ కూడా ఇచ్చారు. దీంతో సంస్థ రూ.75 లక్షలు నష్టపోయింది. ప్రత్యేక బస్సులపై వసూలు చేయాల్సిన 18 శాతం జీఎస్టీని రాబట్టకపోవడంతో ప్రభుత్వానికి రూ.72 లక్షల మేర నష్టం వాటిల్లింది.

బీసీల మహాసభకూ ఇంతే..: వైకాపా 2022 డిసెంబరులో విజయవాడలో నామినేటెడ్ ప్రతినిధులతో బీసీ మహాసభ నిర్వహించింది. దీనికి జిల్లాల్లో 1,439 బస్సులను తీసుకున్నారు. వీటికి కూడా ఆర్టీసీ ప్రత్యేక ఛార్జీల బదులు సాధారణ ఛార్జీలే వసూలు చేసింది. దీనివల్ల ఆర్టీసీకి రూ.91 లక్షలు, జీఎస్టీ రాబట్టకపోవడంతో ప్రభుత్వానికి రూ.85 లక్షల నష్టం వాటిల్లింది. మొత్తంగా రెండు సందర్భాల్లో ఆర్టీసీ రూ.1.66 కోట్లు, ప్రభుత్వం జీఎస్టీ రూపంలో రూ.1.57 కోట్లు నష్టపోయాయి.

**ప్రమాద క్లెయిమ్‌ల మొత్తాన్నీ వసూలు చేయలేదు**

ఆర్టీసీలో అద్దె బస్సులు ప్రమాదానికి కారణమైతే.. బాధితులకు యాక్సిడెంట్ క్లెయిమ్‌లను అద్దె బస్సు యజమానే చెల్లించాలి. ఆర్టీసీ చెల్లిస్తే, ఆ మొత్తాన్ని అద్దె బస్సు యజమాని నుంచి రికవరీ చేయాలి. ఇలా వివిధ ప్రమాద కేసులకు సంబంధించి మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో ఆర్టీసీ రూ.1.58 కోట్ల డిపాజిట్ చేసినా సంబంధిత అద్దె బస్సుల యజమానుల నుంచి వసూలు చేయలేదు. దీనివల్ల వడ్డీ రూపంలో కూడా ఆర్టీసీ రూ.76 లక్షలు కోల్పోయింది.

# ఆ సినిమా ఎవరూ చూడట్లేదు: రాహుల్ గాంధీ




**న్యూఢిల్లీ :** రాజకీయ లబ్ధి కోసం కొందరు వ్యక్తులు సినిమాలను ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పలు వివాదాల నడుమ ఇటీవల విడుదలైన 'ది కేరళ స్టోరీ 2' సినిమాపై స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రాన్ని ఎవరూ చూడట్లేదన్నారు. నిజమైన కేరళ సంస్కృతి సంప్రదాయాలు ఏంటో దేశ ప్రజలందరికీ తెలుసని అన్నారు. సమాజంలో విద్వేషాలు పెంచడానికి, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి కొందరు వ్యక్తులు సినిమాలను, మీడియాను ఆయుధంలా వాడుకుంటున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు.

ఇలాంటి విషయాలను బహిరంగంగా ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తారని.. మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వరని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. తాను కూడా ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నానని తెలిపారు. అయితే, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను భాజపా ఎంపీ మనోజ్ తివారి భార్య సురభి తివారీ తప్పుబట్టారు. ఇంట్లో కూర్చొని ఇటువంటి మాటలు మాట్లాడడం సరైన చర్య కాదని అన్నారు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూశాక, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, కేసులు చదివిన తర్వాత అది నిజమో కాదో ప్రజలే తెలుసుకుంటారని తెలిపారు. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ2' సినిమా రూపొందింది. ఈ చిత్రానికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు.

# పర్యావరణ అనుమతుల్లేకుండా ఖనిజాలు తవ్వేశారు

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 7 :**
'పర్యావరణ అనుమతులు (ఈసీలు) లేకుండా లీజుల్లో తవ్వేసినా అధికారులు చోద్యం చూశారు. ఉల్లంఘనలకు పాల్పడిన లీజుదారులకు జరిమానాలు విధిస్తే.. ప్రభుత్వం వద్ద పునస్సమీక్షలో వాటిని భారీగా తగ్గించారు. వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా, లీజుల మంజూరుపై నిర్ణయాలు తీసుకోకుండా ఏళ్లతరబడి జాప్యం చేశారు' అంటూ గనులశాఖ నిర్లక్ష్యాన్ని, ఆ శాఖ అధికారులు చేసిన తప్పులను కాగ్ కడిగి పారేసింది. 2017-18 నుంచి 2021-22 మధ్య గనులశాఖకు చెందిన కాగ్ నివేదికను శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇందులో గనులశాఖ లోపాలను కాగ్ ఎత్తిచూపింది.

**ఈసీ లేకుండా తవ్వేసినా.. చర్యల్లేవు**

ఏడు గనులశాఖ ఏడీ కార్యాలయాల పరిధిలో 2017-22 మధ్య 159 మంది లీజుదారులు ఈసీలు లేకుండా ఖనిజాన్ని తవ్వి తరలించినట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన లీజుదారులకు రూ.254.15 కోట్ల జరిమానాలు విధించాల్సి ఉన్నా, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈసీలు లేకుండానే లీజుదారులు ఖనిజాలు తరలించేందుకు అనుమతించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాగ్ సూచించింది.

**జరిమానాలను తగ్గించారు**

నిబంధనల ఉల్లంఘనలపై లీజుదారులకు విధించే జరిమానాలను పునస్సమీక్షించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తగిన కారణం ఉంటేనే ఆ జరిమానాలను తగ్గించాలి. కానీ అదేమీ లేకుండానే 31 కేసుల్లో రూ.84.18 కోట్ల మేరకు ఉన్న జరిమానాలను రూ.9.85 కోట్లకు తగ్గించినట్లు గుర్తించారు. ఇందుకు అధికారులను బాధ్యులను చేయాలని కాగ్ సూచించింది.

లీజు దరఖాస్తు అందినప్పట్నుంచి 75 రోజుల్లో ఎల్‌వోఐ జారీచేయాలని నిబంధన ఉన్నా, ఐదేళ్లకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూశాఖ నుంచి నిరభ్యంతర పత్రాలు జారీ కాకపోవడంతో.. 8 ఏడీ కార్యాలయాలు, 4 డీడీ కార్యాలయాల పరిధిలో 1,348 ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు.

**మెరిట్ వసూళ్లు రూ.45 కోట్లు తక్కువ**

2017-22 మధ్య చిన్నతరహా ఖనిజాలకు సీనరేజ్ ఫీజుల ద్వారా రూ.6,367 కోట్లు వసూలు కాగా, ఇందులో 2% కింద ఖనిజాన్వేషణ ట్రస్ట్ (మెరిట్)కు రూ.127.37 కోట్లు రావాల్సి ఉంది. కానీ



అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం రూ.82.31 కోట్లే మెరిట్‌ఫండ్ జమైనట్లు చూపారు. అంటే రూ.45.06 కోట్లు తక్కువగా వసూలు చేసినట్లు గుర్తించారు.

ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) అమ్మకాల టర్నోవర్‌లో 10% మెరిట్‌ఫండ్‌కు జమచేయాలి. 2016-22 మధ్య రూ.476.55 కోట్లు వసూలు చేయలేదు. ఏపీఎండీసీతో సంప్రదిస్తున్నామని గనులశాఖ 2024 జనవరిలో బదులిచ్చింది. 2017-22 మధ్యకాలంలో చిన్నతరహా ఖనిజాల అన్వేషణకు మెరిట్ నిధులేవీ ఖర్చు చేయలేదని ఆడిట్‌లో గుర్తించారు.

**రూ.681.92 కోట్ల డీఎంఎఫ్, మెరిట్ వసూలు కాలేదు**

ప్రభుత్వ పనులకు వినియోగించే ఖనిజాల కోసం గనులశాఖ అనుమతి లేకుండా తవ్వకాలకు అనుమతించారు. దీనివల్ల ఎంత ఖనిజాలను వినియోగించారనేది గనులశాఖ ఏడీల కార్యాలయాల్లో సరైన సమాచారం లేదు. దీంతో అక్రమ తవ్వకాలకు ఆస్కారం కల్పించినట్లయింది. ప్రభుత్వ పనుల్లో వినియోగించిన ఖనిజాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్), ఖనిజాన్వేషణ నిధి (మెరిట్) రూపంలో రూ.681.92 కోట్లు జమకాలేదని గుర్తించారు.

గనులశాఖ అధికారి తన పరిధిలోని లీజులన్నింటినీ ఏడాదిలో తప్పనిసరిగా తనిఖీ చేయాలి. దీనిప్రకారం 2017-22 మధ్య 8మంది ఏడీల కార్యాలయాల పరిధిలో 8,939 లీజుల్లో తనిఖీలు చేయాల్సి ఉండగా, 5,953 లీజుల్లోనే తనిఖీలు జరిపారు. 33% లీజుల్లో తనిఖీలు చేయలేదు. కొవిడ్ కారణంగా 2020-21, 2021-22లో తక్కువగా తనిఖీలు చేసినట్లు వివరణ ఇచ్చినా, 2017-20 మధ్య తనిఖీలు నిర్వహించకపోవడానికి కారణాలు చెప్పలేదని తేల్చారు.

# కల్తీపాల ఘటనలో మరొకరు మృతి

### 11కు మృతుల సంఖ్య - తొమ్మిది మందికి వెంటిలేటర్లపై చికిత్స



**రాజమహేంద్రవరం సిటీ :** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సంచలనం సృష్టించిన కల్తీ పాల సంఘటనలో శనివారం మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 11కు చేరింది. రాజమహేంద్రవరంలోని ఆర్‌టిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆనాల ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న బళ్ల అనంతలక్ష్మి (72) కల్తీపాల ఘటనలో గత నెల 17వ తేదీ నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఇద్దరు కల్తీపాల సంఘటనలో పది రోజుల క్రితం మృతి చెందారు. అనంతలక్ష్మి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మరో తొమ్మిది మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

# ఇరాన్ యుద్ధ నౌకపై యూఎస్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 4న నౌకను ఇరాన్ కొచ్చిలో నిలిపిందన్నారు. అందులోని 183మంది సిబ్బందికి కొచ్చిలోనే ఆశ్రయమిచ్చినట్లు తెలిపారు. భారత్ సరైన నిర్ణయమే తీసుకుందన్నారు.

శ్రీలంక తీరంలో దాడి జరిగిన వెంటనే ఐరిస్ దేనా నౌక నుంచి తొలుత శ్రీలంక నౌకాదళానికి ప్రమాద హెచ్చరిక వచ్చిందని, ఆ వెంటనే భారత నౌకా దళాలు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు.

# చిరుకు పవన్ కల్యాణ్ అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)

నటించాడని, ఈ అవార్డుకు అతడు అర్హుడని కొనియాడారు. 'దుల్ల కొడతా నాన్న' అంటూ తండేల్ డైలాగుకు హార్ట్ ఎమోజీ జోడించి అభినందించారు. తెలంగాణ ప్రభుత్వానికి నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఏయన్నార్ పేరుతో అవార్డును ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏయన్నార్ అవార్డు జయసుధకు రావడం ఆనందంగా ఉందన్నారు.

**గద్దర్ అవార్డుల్లో ఈటీవీ విన్ సత్తా..**

తాజాగా ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో ఈటీవీ విన్ సత్తా చాటింది. నాణ్యమైన కంటెంట్‌తో కుటుంబ ప్రేక్షకులను అలరించేందుకు ఎప్పుడూ ముందుండే ఈటీవీ విన్ ఏకంగా 6 అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సంస్థ నిర్మించిన రాజు వెడ్స్ రాంబాయి 4 అవార్డులకు ఎంపిక కాగా.. ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ (డెబ్యూ)గా లిటిల్ హార్ట్స్, ఉత్తమ బాలల చిత్రంగా అనగనగా నిలిచాయి.

రాజు వెడ్స్ రాంబాయికి వచ్చిన అవార్డులు..
ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
స్పెషల్ జ్యూరీ - చైతు జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి)

# ఆపరేషన్ 'వజ్ర ప్రహార్' ఏపీ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యమని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారు. "రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల ఆపరేషన్ వజ్రప్రహార్ కార్డెన్ సెర్చ్ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి సరఫరా జరిగే 849 హాట్ స్పాట్స్ గుర్తించాం. వీటికి అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు కొనసాగుతాయి" అని ఐజీ చెప్పారు.

# తెలంగాణ గడ్డపై హింసకు తావులేదు: సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

గణపతి కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలి. ఆయనకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది. స్వగ్రామాల్లో ఇల్లు కట్టుకునేవారికి సాయం చేస్తాం. మెరుగైన పరిహారం, ఆరోగ్యం, ఇంటి నిర్మాణానికి సాయం చేస్తాం. ఇప్పటి వరకు 721 మంది మావోయిస్టులు లొంగిపోయి 250 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం. నగదు బహుమతిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ వర్గాల నిఘా ఉంటుంది. కాబట్టి అందరూ లొంగిపోండి" అని రేవంత్ పిలుపునిచ్చారు.

**అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తాం**

సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీలో ఉన్నవాళ్లు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అందరూ కలిసి వస్తే, తెలంగాణ పునర్నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. " గూడేలు, తండాల్లో ఉన్నవారి మెరుగైన జీవితానికి కృషి చేద్దాం. ఆదివాసీ, గిరిజనుల ఆర్థికస్థోమత పెరిగేలా మేం కృషి చేస్తున్నాం. మావోయిస్టులపై ఎత్తివేయగల కేసులు ఉంటే ప్రభుత్వం సానుకూలంగా ఉంది. చట్టపరంగా ఎత్తివేయడానికి అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తాం. తీవ్రమైన నేరాలు ఉంటే ప్రభుత్వాలు ఎత్తివేసినా.. కోర్టులు ఊరుకోవు. వ్యక్తులు, వారిపై ఉన్న నేరాల తీవ్రతనుబట్టి పరిశీలిస్తాం. లొంగిపోయిన వాళ్లు రాజకీయాల్లోకి వస్తామన్నా.. స్వాగతిస్తాం. కొందరు ఇప్పటికే రాజకీయాల్లోకి వచ్చి.. ప్రజా ప్రతినిధులు అయ్యారు. సీతక్క లాంటి వాళ్లు రాష్ట్ర మంత్రి కూడా అయ్యారు. కాంగ్రెస్‌లోకి వచ్చే వాళ్లు పీసీసీని కలిసి ఆసక్తి తెలియజేయవచ్చు" అని రేవంత్ అన్నారు.

# బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం.. రాష్ట్రపతి అసహనం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు గానీ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాకపోవడం గమనార్హం.

# పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయింది: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

గుప్పిట్లో పెట్టుకుని, పాలించాలని ఇరాన్ చూసింది. కానీ, ఓటమి పాలైంది. ఆ దేశం లొంగిపోవడమో, లేదా కుప్పకూలిపోవడమో జరిగేవరకు.. దశాబ్దాలపాటు పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది. ఈ రోజు ఇరాన్‌పై భీకర దాడులు జరగనున్నాయి. ఆ దేశ దుష్ప్రవర్తన కారణంగా.. అక్కడి ప్రాంతాలను సర్వనాశనం చేసే అంశం కూడా పరిశీలనలో ఉంది" అని ట్రంప్ హెచ్చరించారు.

# భవిష్యత్‌లో అనేక దేశాలకు మన విద్యుత్ : చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

వారి కోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నాం. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయి" అని చంద్రబాబు అన్నారు.

విశాఖ సమాచారమ్
ఆదివారం 8-3-2026

# మిత్ర దేశాల మౌనం.. యుద్ధంలో చేదు నిజం!

ఇజ్రాయెల్ దాడులతో సంక్షోభంలో ఉన్న ఇరాన్‌కు రష్యా, చైనా, భారత్ ఎందుకు బహిరంగ మద్దతు ఇవ్వడం లేదు? మధ్యప్రాచ్య రాజకీయాలు, ఆర్థిక ప్రయోజనాలు, భారత్ వ్యూహాత్మక మౌనం వెనుక ఉన్న కారణాలపై విశ్లేషణ.

మిత్ర దేశాల మౌనం.. యుద్ధంలో చేదు నిజం!

దశాబ్దాల పాటు పశ్చిమ దేశాల కళ్లలో కారం కొడుతూ.. మధ్య ప్రాచ్యంలో ఒక తిరుగులేని శక్తిగా ఎదిగిన ఇరాన్ నేడు ఉనికి కోసం పోరాడుతున్నది. మొదటినుంచి అంతర్జాతీయ రాజకీయాల్లో ఇరాన్ రెండు అంశాలపై ఆధారపడింది. ఒకటి తన వద్ద ఉన్నఅపార మైన క్షిపణి సంపత్తి.. రెండోది అగ్రరాజ్యాలైన రష్యా, చైనాల వెన్నుదన్ను..

కానీ, ఎవరూ ఊహించని విధంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేయడం.. సుప్రీం లీడర్ ఖమేనీ నేలకొరగడంతో ఇరాన్ కోలుకోలేని విధంగా దెబ్బతింది. ఆ దేశంపై వైమానిక దాడులు జరుగుతున్నా.. ఇరాన్ మిత్ర దేశాలు మౌనంగా ఉండటం.. ఇరాన్ ప్రజలనే కాదు ప్రపంచాన్నే ఆశ్చర్యపరుస్తోంది. రష్యా, చైనాతో పాటు మిత్ర దేశమైన భారత్ కూడా మౌనంగా ఉండటానికి కారణాలు ఏంటి?

సిరియా బంధం.. రష్యాకు ప్రతిబంధకం!

ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకున్న రష్యాకు ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు సరఫరా చేసిన మాట వాస్తవం. ఇప్పుడు ఇరాన్ కష్టాల్లో ఉన్నా.. రష్యా నేరుగా రంగంలోకి దిగడం లేదు. దీనికి ప్రధాన కారణం, ఇజ్రాయెల్‌తో రష్యాకు ఉన్న రహస్య దౌత్య సంబంధాలు.. సిరియాలో రష్యా ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండాలంటే ఇజ్రాయెల్ మద్దతు అవసరం. అందుకే పుతిన్ 'మధ్యవర్తి' పాత్ర పోషిస్తున్నారే తప్ప, ఇరాన్ తరపున యుద్ధం చేయడం లేదు. యుద్ధం మొదటిరోజు చేసిన గంభీర ప్రకటనలు కాస్తా మూడు, నాలుగు రోజులకు మధ్యవర్తి పాత్రకు పరిమితమయ్యాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో యుద్ధం వల్ల జరుగుతున్న నష్టాలపై వివరించినా.. ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్‌లో చివరి క్షిపణిని ధ్వంసం చేయడంతో పాటు హౌతి, హెజ్బొల్లాలను నిర్వీర్యం చేసే వరకు దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. దీంతో ఈ యుద్ధం ఏప్రిల్ నెల మధ్య వరకు ఆగేలా లేదు.

చైనా చేతులకు 'ఆర్థిక' సంకెళ్లు..!

చైనాకు ఇరాన్ ఒక చౌక చమురు వనరు మాత్రమే.. ఇరాన్‌తో 25 ఏళ్ల ఒప్పందం చేసుకున్నప్పటికీ, అమెరికా తో నేరుగా సైనిక ఘర్షణకు దిగడం చైనాకు ఇష్టం లేదు.. చైనా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒడిదుడుకుల్లో ఉంది. అమెరికా ఆంక్షలకు భయపడి, చైనా బ్యాంకులు ఇరాన్‌తో లావాదేవీలను నిలిపివేస్తున్నాయి. చైనా ఇరాన్ విషయంలో ఒక్క అడుగు ముందుకు వేసినా.. ప్రపంచవ్యాప్తంగా చైనా ఆస్తులను సీజ్ చేసేందుకు అమెరికాకు తాళం ఇచ్చినట్టు అవుతుంది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, దేశ భద్రతకు భంగం కలిగించడాన్ని తాము సహించమని మొదటిరోజు చేసిన తీవ్రమైన ప్రకటన కాస్తా మూడు, నాలుగు రోజులకే చల్లబడింది. అయితే, అమెరికా మాత్రం చైనా రంగంలోకి దిగితే ఎక్కడ పరిస్థితి మారుతుందోనన్న భయంతో అఫ్గాన్ – పాక్ యుద్ధానికి తెర లేపింది. ఎందుకంటే చైనా ఇరాన్ సరిహద్దుల మధ్య అఫ్గాన్, పాక్ దేశాలు ఉంటాయి. ఆయుధాలు, ఇతర సామగ్రి సరఫరా చేసేందుకు సముద్ర జలాలు అంత సురక్షితం కాకపోవడంతో రోడ్డు మార్గాన చేరే వేసే అవకాశం ఉంటుంది. అందుకే అమెరికా ఇరాన్ యుద్ధానికి ముందు అఫ్గాన్, పాక్ మధ్య ఘర్షణ వాతా వరణం సృష్టించింది.


చిక్కుముడిలో భారత్.. మౌనమే వ్యూహం!

భారత్‌కు అటు ఇజ్రాయెల్ అత్యంత సన్నిహిత రక్షణ మిత్రుడు, ఇటు ఇరాన్ చారిత్రక.. వ్యూహాత్మక భాగస్వామి. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం విషయంలో భారత్ ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఉంటుంది. మరోవైపు ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు భారత్‌కు ఇరాన్ ద్వారా ఆఫ్ఘనిస్తాన్, రష్యాకు దారిని ఇస్తుంది. అందుకే భారత్ ఇరాన్ యుద్ధం విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నది. ఇప్పుడు భారత్‌కు అన్నింటికంటే ముఖ్యమైనది.. ఇండియా మిడిల్ ఈస్ట్, యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ). ఇది భారత్ కలల ప్రాజెక్టు.. ఇది పూర్తయితే మిడిల్ ఈస్ట్ దేశాలతో పాటు యూరప్ వరకు భారత్ తన వ్యాపారాన్ని విస్తరిస్తుంది. ఇది ఇజ్రాయెల్ మీదుగా కొనసాగుతుండటంతో ఆ దేశం పూర్తి మద్దతు అవసరం ఉన్నది. అందుకే భారత్ ఇప్పటివరకు ఏ పక్షం వహించకుండా, 'చర్చల ద్వారానే పరిష్కారం' అని చెప్తూ వస్తున్నది. యుద్ధం వల్ల సమీకరణాలు మారితే ఈ ప్రాజెక్ట్ ఆగిపోయే ప్రమాదం ఉంది. ఈ కారిడార్‌ను కాపాడుకోవడానికి అమెరికా, సౌదీ అరేబియాతో భారత్ కలిసి పని చేయాల్సి ఉంటుంది.

ఒక పక్షం వైపు నిలబడితే.. ప్రమాదం!

మరోవైపు యుద్ధం తర్వాత ఇరాన్‌లో పాలన గాడితప్పి.. చైనాపై ఆ దేశం ఆధారపడినా భారత్ కలలకు గండిపడే అవకాశం ఉన్నది. అందుకే ఈ వ్యవహారాన్ని భారత్ అత్యంత సున్నితమైన అంశంగా భావిస్తున్నది. మార్చి మూడో వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో భారత్ ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య మధ్యవర్తి పాత్ర పోషించే అవ కాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే గురువారం ఇరాన్ హోర్ముజ్ జలసంధి నుంచి భారత్, చైనాలకు చమురు సరఫరాకు అంగీకరించింది. ఇరాన్ విషయంలో భారత్ మిత్ర ధర్మం పాటించక పోవడానికి మరో ముఖ్యమైన కారణం.. అరబ్ దేశాల్లో ప్రవాస భారతీయులు. వీరు దాదాపు 90 లక్షల మంది ఉన్నారు. యుద్ధంలో ఒకవైపు నిలబడితే వారందరి జీవనోపాధిని ఫణంగా పెట్టడమే అవుతుంది. ఒక్క రాజకీయ నిర్ణయం కోటి మంది కుటుంబాల్లో కల్లోలం రేపే ప్రమాదం ఉన్నది.

# అత్యున్నత స్థాయిలో అతివ




## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

ప్రాచీనకాలంలో స్త్రీలకు పురుషులతో సమానస్థాయి గౌరవం లభించేది. వేదాలు స్త్రీపురుషులకు సమాన గౌరవం ఇచ్చాయి.మహిళ విద్యావంతురాలు.ఇంటికి ఇల్లాలు,కదిలివచ్చిన మహాలక్ష్మి. భర్తకు సహచరి,అత్తమామలకు కుమార్తె,ఆడబిడ్డకు అక్కమరుదులకు సోదరిగా ఉండేది.భర్త అడుగుజాడలలో నడుస్తూ అత్తవారి ఇల్లును తన ఇల్లుగా భావించేది.వారి వంశాకురాలకు జన్మనిచ్చేది. కార్యేషు మంత్రి,భోజ్యేషు మాత,శయనేషు రంభ గా భర్తకు సేవ చేయాలని వేదాలు చెబుతున్నాయి.అయినా అవసరం అయితే అపరకాళి అయ్యేది. ఈశ్వరుడు భార్యకు శరీరంలో సగభాగమిచ్చి అర్థనారీశ్వరుడు అయ్యాడు.విష్ణువు భార్య లక్ష్మీదేవిని హృదయంలో దాచుకొన్నాడు.దీనిని బట్టి పురాణాలు,వేదాలలో స్త్రీలకు ఇచ్చిన గౌరవం అర్థమవుతున్నది.

త్రేతాయుగంలో (రాముని కాలంలో)గార్గి,మైత్రేయి లు వేదాన్ని ఆపోసన పట్టారు.ఝ్ఞవల్కమహర్షితో వేదం,తర్క శాస్త్రాలపై వాదనలు చేసి మెప్పించారు. వేదకాలం నాటి అనసూయ త్రిమూర్తులను పసిబిడ్డలుగా చేసి తన ప్రాతివత్యాన్ని నిరూపించింది. త్రిశక్తులను పాదాక్రాంతం చేసుకుంది. సీత రాముడితో అడవులకు వెళ్లి సహధర్మచారిణి గా పేరు పొందింది. వశిష్టుని భార్య అరుంధతి సప్తర్షి మండలిలో భర్త పక్కన తారగా వెలుగొందుతోంది. నూతన దంపతులకు అరుంధతి నక్షత్ర దర్శనం హిందూ సాంప్రదాయంలో వేలాది సంవత్సరాలుగా విరాజిల్లుతున్నది. విశ్వామిత్రమేనకలకు జన్మించిన శకుంతల దుర్వాసుని శాపం వల్ల భర్తకు తాత్కాలికంగా దూరమైనా భావి భారత చక్రవర్తి భరతుని పెంపకంలో ధైర్యసాహసాలు ఉగ్గుపాలతో రంగరించింది.

సుమతి తన భర్తను శాపం నుంచి విముక్తిడిని చేసింది. సావిత్రి యముడితో పోరాడి తన భర్తను బతికించుకుంది. మండోదరి రావణుడి ధర్మపత్ని అయినా సీతాపహరణాన్ని విబేధించింది.ఇంద్రజిత్ భార్య సులోచన కూడా పతివ్రతే. అహల్య చేసిన తప్పుకు ఆమెను అదృశ్యరూపంలో తపస్సు చేయాలని ఆమె భర్త గౌతముడు ఆదేశించారు తప్ప శాపం ఇవ్వలేదు.ఆమెను సంస్కరించి తిరిగి భార్యగా చేపట్టాడు.అంతేగాని పరిత్యగించలేదు.భార్యాభర్తల సంబంధం,వివాహబంధాలకు వేదకాలంలో అంతటి ప్రాముఖ్యత ఇచ్చేవారు. ఒకసారి వివాహబంధంతో ఒక్కటైన దంపతులు చచ్చేవరకూ కలసి ఉండడమే వేద ప్రమాణం.విడాకుల ప్రస్తావన వేదాలలో కనిపించవు.వేదకాలంలో స్త్రీలు కూడా యుద్ధవిద్యలను అభ్యసించేవారు. యుద్ధాల్లో భర్తలకు చేదోడువాదోడుగా ఉండేవారు. ద్వాపర యుగంలో సత్యభామ నరకాసురవధలో కృష్ణునికి తోర్పాటు నందించింది. సీతామాత కూడా అన్నివిద్యలందు నిష్ణాతురాలే. శాతవాహన వంశంలోతమ పేరు ముందు తల్లిపేరును శాతకర్ణులు పెట్టుకున్నారు.గౌతమీ పుత్ర శాతకర్ణి తన తల్లి పేరుతో చలామణి అయ్యవారు.

మౌర్యవంశంకూడా తల్లిపేరుమీద ఏర్పడింది. చంద్రగుప్త మౌర్యుడు అందుకు ఉదాహరణ.జిజియాబాయి శివాజీ ని తిరుగులేనిశక్తిగా రూపొందించింది.ఖడ్కతిక్కన భార్య యుద్ధం నుంచి పారిపోయి వచ్చిన భర్తకు ధైర్యం నూరిపోసింది.

వేదకాలంలో స్త్రీపురుషులు విద్యావంతులే కాకుండా పరస్పర సహకారగౌరవాలతో జీవించేవారని చరిత్ర చెబుతున్నది. మహిళలు కుటుంబ బాధ్యలతోపాటు భర్తకు అన్నివిధాలా సహాయసహకారాలు అందించి కీర్తిగడించారు. వివాహితకు తల్లికి ఇచ్చిన గౌరవం ఇచ్చేవారు.

మధ్యయుగం నాటికి భారత దేశ పరిస్థితి,మహిళల స్థాయి మారిపోయింది. తురుష్కుల దండయాత్రలతో ఉత్తర భారతం అల్లకల్లోలం అయింది.ప్రపంచ ప్రసిద్ధి పొందిన తక్షశిల, నాగార్జున మొదలైన విశ్వవిద్యాలయాలను తురుష్కులు నాశనం చేసి భారతీయ వేద విద్యాసంస్కృతి సగం నాశనం చేసారు.ఆంగ్లేయులు మిగతాది కనుమరుగు చేసారు. తురుష్కుల దండయాత్రల దృష్ట్యా యువతుల రక్షణకు బాల్యవివాహ సాంప్రదాయం,సతీ సహగమనం చోటుచేసుకున్నాయి. వర్ణ సంక్రమణం నిరోధించేందుకు జోహార్(ఆత్మాహుతి)సంప్రదాయం రాజస్తాన్ తదితర ప్రాంతాలలోవచ్చింది.శత్రువులు(తురుష్కులు)రాజ్యమును జయించి రాణీవాసంలో ప్రవేశించే ముందే అక్కడి స్త్రీలు ఆత్మాహుతి చేసుకునేవారు.చరిత్రలో మేవాడ్ రాజు భార్య పద్మిని సౌందర్యం విని తురుష్క రాజు ఎలాగైనా ఆమెను పొందాలని వక్రమార్గంలో ఆ రాజుపై విజయం సాధించడంతో పద్మిని ఆత్మాహుతి చేసుకుందని చరిత్ర చెబుతున్నది.

బాల్యవివాహల దృష్ట్యా బాలికల విద్యాభ్యాసానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. రాజ్యవిస్తరణలో భాగంగా రాజులు వేరేరాజుల కుమార్తెలను వివాహం చేసుకునేవారు. ఒకసారి పుట్టిల్లు దాటితే మళ్లీ చూసే అవకాశం తక్కువ ఉండేది. స్త్రీల స్వాతంత్రానికి కొంత మసకబారింది. ముస్లిం చక్రవర్తి అక్బర్ రాజపుత్ర మహిళ జోధాబాయిని వివాహం చేసుకున్నాడు. మత మార్పిడులు కూడా చోటు చేసుకున్నాయి. ఆంగ్లేయుల పాలనలో భారతీయ విద్యావ్యవస్థ సర్వనాశనం చేసారు.గురుకులవ్యవస్థను రూపుమాపారు. ఆంగ్లేయ అధికారి మెకాలే ప్రవేశపెట్టిన విద్యావిధానం భారతీయులను బానిసలుగా మార్చింది.మహిళా విద్యకు మంగళం పాడింది.

ఇదిలా ఉండగా దక్షిణ భారతంలో మధ్యయుగంలో స్త్రీల ప్రాముఖ్యత ఏ మాత్రం తగ్గలేదు. రుద్రమదేవి వంటి మహారాణులు ఈ గడ్డను ఏలారు. ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరవనితలు పుట్టారు.జిజియాబాయి లాంటి తల్లులు శివాజీ వంటి వీరపుత్రులను కన్నారు. అక్కమాంబ, మొల్ల,వెంగమాంబ, తిరుమలాంబిక, పద్మావతి, విజయాంబిక, ం ామభద్రాంబ,గ ంగాదేవి వంటి రచయిత్రులు;కవయిత్రులు సంస్కృతాంధ్ర అభివృద్ధికి కృషి చేసారు. ఈ యుగంలోకూడా భారతీయ మహిళ ప్రాముఖ్యత ఔన్నత్యం ఏ మాత్రం తగ్గలేదు. అదే భారతీయ మహిళ గొప్పదనం.ఆర్థికంగా పురుషుడితో పోటీ పడుతున్నా కుటుంబం కోసం సర్దుకు పోతున్నది. ఈ ఆధునిక యుగంలో ఆమె మానసికంగా పురుషుడిని దాటి ఎప్పుడో అత్యున్నత స్థాయికి చేరుకుంది.

**యం.వి.రామారావు**

# లింగ సమానత్వం వేగం పెంచాల్సిన సమయం



మార్చి 8, మరోసారి వచ్చింది శుభాకాంక్షలు,సభలు,సమావేశాలు, ఉత్తేజపూరిత ప్రసంగాలు, పుష్పగుచ్ఛాల సందడి కనిపిస్తుంది కానీ అంతర్జాతీయ మహిళ దినోత్సవ అసలు ఉద్దేశ్యం వేడుకలు కావు.నిజాయితీగా మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన ఆత్మపరిశీలన.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు "ఒక సమాజం ఎంత అభివృద్ధి చెందిందనేది, ఆ సమాజంలోని మహిళల అభివృద్ధి ఆధారంగా కొలవాలి.". దేశ అభివృద్ధికి నిజమైన కొలమానం ఆ దేశ మహిళల స్థితి.ఈ కొలమానంలో భారత్ ఎక్కడ నిలిచింది, సాధించిన విజయాల ముందు, ఇంకా సాధించాల్సింది ఎంత ఉంది? గణాంకాలు ఏం చెప్తున్నాయి? వాస్తవ పరిస్థితి ఎలా ఉందనే ప్రశ్న ప్రతి ఏడాది మరింత గంభీరంగా ఈ సమాజానికి ఎదురవుతూనే ఉంటుంది.

**గణాంకాలు చెబుతున్న వాస్తవం**

ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన Global Gender Gap Report 2025 ప్రకారం, 148 దేశాల్లో భారత్ 131వ స్థానంలో ఉంది. దేశం మొత్తం లింగ అసమానతలో సుమారు 64 శాతం మాత్రమే తగ్గించగలిగింది. విద్య, ఆరోగ్యం రంగాల్లో మెరుగైన ప్రగతి ఉన్నప్పటికీ, ఆర్థిక భాగస్వామ్యం మరియు రాజకీయ ప్రతినిధ్యం విషయంలో ఈ అంతరం ఇంకా గణనీయంగానే ఉంది.

విద్యలో పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంది. మహిళాఉపురుషుల మధ్య విద్యా సమానత్వ సూచిక 97 శాతానికి చేరుకోవడం ఈ ప్రగతికి సంకేతం. ఉన్నత విద్యలో బాలికల నమోదు శాతం పెరగడం కూడా సామాజిక పరివర్తనకు సూచిక. కానీ చదువు పూర్తయ్యాక ఉద్యోగ రంగంలోకి అడుగుపెట్టే సమయంలోనే అసమానత,అంతరం తీవ్రంగా కనిపిస్తోంది.

తాజా అంచనాల ప్రకారం,కార్మిక శక్తిలో మహిళలు పాల్గొనే శాతం గత దశాబ్దంతో పోలిస్తే పెరిగినప్పటికీ, అది పురుషులతో పోలిస్తే గణనీయంగా తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర అధికంగా ఉన్నప్పటికీ, పట్టణాల్లో సుస్థిర ఉద్యోగాలు, నాయకత్వ స్థానాల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది.

పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం సుమారు 14 శాతం మాత్రమే ఉండటం మరో వాస్తవం. స్థానిక సంస్థల్లో 33 నుంచి 50 శాతం వరకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్ణయాధికార స్థానాల్లో మహిళల సంఖ్య తక్కువ. మహిళా రిజర్వేషన్ చట్టం ఆమోదం ఒక చారిత్రాత్మక అడుగు అయినా, అది అమలులోకి రావడమే అసలు పరీక్ష. అన్ని రాజకీయ పార్టీలు దీనికి బాధ్యత వహించవలసి ఉంటుంది.

**విజయాల వెలుగు నారీ శక్తి**

ఇన్ని సవాళ్ల మధ్య భారత మహిళ సాధించిన విజయాలు అశేషం. అంతరిక్ష, చంద్రయాన్ మిషన్లలో మహిళా శాస్త్రవేత్తల కీలకపాత్ర, క్రీడల్లో ఒలింపిక్ పతకాలు సాధించిన క్రీడాకారిణులు, స్టార్టప్ రంగంలో ముందుకు వచ్చిన యువ మహిళా పారిశ్రామికవేత్తలు ఇవన్నీ మారుతున్న భారత ముఖచిత్రం.

స్వయం సహాయక సంఘాలు గ్రామీణ మహిళల ఆర్థిక జీవితాలను గణనీయంగా మార్చేశాయి. లక్షలాది మహిళలు బ్యాంకు ఖాతాలు తెరచి, సూక్ష్మ రుణాలు పొందుతూ, చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. జనధన్, ప్రత్యక్ష నగదు బదిలీ, ఆర్థిక ప్రగతిని వేగవంతం చేశాయి. బ్యాంకింగ్ రంగంలో మహిళల ఖాతాదారుల శాతం పెరగడం ఆర్థిక స్వావలంబనకు సంకేతం.

**డిజిటల్ విప్లవం మరో కీలక మార్పు.**

స్మార్ట్‌ఫోన్ మహిళల చేతిలోకి రాగానే ఆన్‌లైన్ వ్యాపారం, ఈ–కామర్స్, డిజిటల్ పేమెంట్స్ ద్వారా మహిళలు కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. అయితే ఇదే డిజిటల్ ప్రపంచం సైబర్ వేధింపుల రూపంలో మహిళలకు కొత్త సవాళ్లను కూడా విసురుతోంది.

**ఇంకా మిగిలిన సవాళ్లు**

వేతన అసమానత భారత కార్మిక రంగంలో ప్రధాన సమస్య. సమాన పనికి సమాన వేతనం అన్న రాజ్యాంగ సూత్రం ఆచరణలో పూర్తిగా అమలు కాలేదు. అసంఘటిత రంగంలో పనిచేసే మహిళలకు సామాజిక భద్రత తక్కువ. గృహ హింస కేసులు, బాల్య వివాహాలు, పోషకాహార లోపం ఇవి అభివృద్ధి చిత్రాన్ని మసకబార్చే అంశాలు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలు చూపిస్తున్నట్లుగా, గ్రామీణ ప్రాంతాల్లో ఎనీమియా సమస్య తీవ్రంగా ఉంది. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు, మెరుగుపడుతున్నప్పటికీ అవగాహన లోపం మరియు సామాజిక ఆంక్షలు మహిళల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

పని,కుటుంబ సమతుల్యత మరో కీలక అంశం.

ప్రసూతి సెలవులు ఉన్నప్పటికీ, కార్యాలయ సంస్కృతి మహిళల ఎదుగుదలకు అనుకూలంగా మారే వాతావరణం ఇంకా సుదూరంగానే ఉంది. నాయకత్వ స్థానాల్లో మహిళల సంఖ్య పెరగకపోతే నిర్ణయ ప్రక్రియలో సమాన దృక్కోణం సాధ్యం కాదు.

**చట్టాలు ఉన్నాయ్‌౦ అమలే కీలకం**

చట్టం, గృహ హింస నిరోధక చట్టం, ప్రసూతి ప్రయోజన చట్టయిఇవన్నీ మహిళల రక్షణకు ఉన్న చట్టాలు. కానీ అవగాహన లేకపోతే, అమలు లోపిస్తే అవి పుస్తకాలకే పరిమితం అవుతాయి. చట్టం మాత్రమే సమానత్వం ఇవ్వదు; సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే, ఈ చట్టాలు అమలుకు నోచుకుంటాయి. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు అయితే రాజకీయ రంగంలో పెనుమార్పు సంభవిస్తుంది. కానీ అది ప్రతీకాత్మకంగా కాక, ప్రభావవంతంగా ఉండాలంటే మహిళలకు నాయకత్వ శిక్షణ, రాజకీయ అవకాశాలు, పార్టీ స్థాయిలో ప్రోత్సాహం అవసరం.అంత మాత్రమే కాదు, గెలిచిన మహిళల కుటుంబ సభ్యుల పాత్ర వారి ఆలోచనలకు,ఆచరణకు అనుకూలంగా ఉండాలే తప్ప ఆటంకంగా మారి మహిళల నిర్ణయాలను ప్రభావితం చేయకూడదు.

**సమాజపు బాధ్యత**

మహిళా సాధికారత ప్రభుత్వ పథకాలతో మాత్రమే సాధ్యం కాదు. కుటుంబం నుంచి ప్రారంభమయ్యే సంస్కరణ అవసరం. బాలికకు సమాన విద్య, సమాన ఆహారం, సమాన వారసత్వ హక్కులు ఇవి కుటుంబ స్థాయిలోనే నిర్ణయించబడతాయి. అంతేకాకుండా ఆడపిల్లలను పెంచే విధానం పుట్టినప్పటినుండే ఒక రకమైన పరాధీనత భావనలొ అత్యధికులు పెంచబడ్డున్నారు.చిన్నప్పటినుండి ఆడపిల్లలు ఆడుకునే ఆటబొమ్మలు స్టవ్,చెంబు, చాట,చీపురు,బక్కెట్, వంటపాత్రలు మగపిల్లలు ఆడుకునే బొమ్మలు తుపాకీ, కార్,హెలికాప్టర్, ట్రాక్టర్, ఇలా తల్లిదండ్రులు తమకు తెలియకుండానే ఆడపిల్లల్ని గృహానికి పరిమితం చేసే సామాజికీకరణ వైపు నెట్టబడ్తున్నారనేది వాస్తవం.

పురుషుల భాగస్వామ్యం లేకుండా లింగ సమానత్వం అసాధ్యం. ఇంటిపనులు పంచుకోవడం నుంచి కార్యాలయంలో సమాన అవకాశాలు కల్పించడం వరకు ప్రతి అడుగు సమానత్వాన్ని బలపరుస్తుంది. లింగ సమానత్వం మహిళల సమస్య కాదు సామాజిక బాధ్యత.

**భవిష్యత్ దిశ**

2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో లింగ సమానత్వం ఒక కీలక అంశం. భారతదేశం ఆ లక్ష్యాన్ని సాధించాలంటే విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో సమగ్ర విధానాలు అవసరం. గ్రామీణ మహిళలకు నైపుణ్య శిక్షణ, పట్టణ మహిళలకు సురక్షిత ఉద్యోగ వాతావరణం, డిజిటల్ భద్రత ఇవి సమాంతరంగా ముందుకు సాగాలి.


మహిళల కార్మిక శక్తి పాల్గొనిక 50 శాతం దాటితేనే దేశ ఆర్థిక వృద్ధి వేగం రెట్టింపు అవుతుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంటే మహిళా సాధికారత కేవలం సామాజిక న్యాయం కాదు ఆర్థిక అవసరం కూడా. మార్చి 8 మహిళా దినోత్సవ వేడుకలను పుష్పగుచ్ఛాలతో ముగించకుండా, విధాన మార్పులతో ముందుకు తీసుకెళ్లాలి. సమాన పనికి సమాన వేతనం, సమాన అవకాశాలు, సమాన గౌరవం,ఇవి రాజ్యాంగ హామీలు మాత్రమే కాక ఆచరణలో ప్రతిఫలించాలి.

దేశ ప్రగతిని రోడ్లు, భవనాలలో కాదు మహిళల చిరునవ్వుల ఆధారంగా అంచనా వేయాలి, ఆ చిరునవ్వులో భద్రత, గౌరవం, స్వావలంబన ప్రతిఫలించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ఈ మహిళా దినోత్సవం మనందరికీ ఒక ప్రశ్న వేస్తోంది, సమానత్వాన్ని వేడుకగా జరుపుకుంటామా? లేక కార్యాచరణగా అమలు చేస్తామా?

**డాక్టర్ శామ్యూల్ జాన్ ఆదూరి**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**డిపార్ట్మెంట్ ఆఫ్ సోషియాలజి**
**ఆంధ్రా యూనివర్సిటీ**

# ఏఐ.. క్వాంటమ్ టెక్నాలజీ.. హీరోలు



కొత్తకు ఎపుడూ స్వాగతం.. పాతకో వందనం” ..కొత్త ఏడాది రాగానే తెలుగువారిలో చాలా మందికి గుర్తొచ్చే పాట ఇది! ఈ సందర్భంలో కొత్త అంటే.. నూతన సంవత్సరం అనే కాదు! కొత్త టెక్నాలజీ.. కొత్త ఫ్యాషన్.. మొత్తంగా కొత్తదనమేదైనా సరే స్వాగతం చెబుతాం అని అర్థం! అలా స్వాగతిస్తాం కాబట్టే.. 2024లో కొత్తకొత్తగా అప్పుడే రెక్కలు విచ్చుకుంటున్న ‘కృత్రిమ మేధ (ఏఐ)’ పరిజ్ఞానం 2025లో మనందరి చేతుల్లోకీ అందుబాటులోకి వచ్చేసింది! తప్పటడుగులు వేసే చిన్నపిల్లాడిలా తడబడిన ఏఐని వేలుపట్టి నడిపించి ఏడాది చివరికల్లా చాలా పనులకు వాడుకునే స్థితికి వచ్చేశాం. మరీ ముఖ్యంగా.. వైద్యం, పరిశోధన, ఐటీ రంగాల్లో ఏఐ ఇప్పటికే అద్భుతాలు చేస్తోంది. 2026లో ఈ ఏఐ వినియోగం మరింత పెరిగిపోతుందని.. ‘ఇందుగలదు అందులేదన్న సందేహం వలదు’ అన్నట్టుగా విశ్వరూపం దాల్చి మన జీవితాల్లోకి మరింత చొచ్చుకొస్తుందని టెక్ నిపుణులు చెబుతున్నారు! దీనికితోడుగా.. క్వాంటం ఫలాలు కూడా ఈ ఏడాది సాధారణ ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, ఆ టెక్నాలజీ మన దైనందిన జీవితాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటుందని వారు అంచనా వేస్తున్నారు. 2024లో మొదలైన ఏఐ విప్లవం 2025లో మనందరి జీవితాలనూ ప్రభావితం చేసే స్థితికి చేరుకున్నట్టుగానే.. 2025లో మొదలైన క్వాంటం రంగ విప్లవం 2026లో పలు రంగాలను ప్రభావితం చేస్తుందన్నది వారి భావన.ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండినష్టం కాదు.. లాభమే!మనం పనిచేసే తీరును, సమస్యలను పరిష్కరించుకునే తీరును ఏఐ ఒక్క ఏడాదిలోనేమార్చేసిందనడంలో సందేహం లేదు. కంప్యూటర్లు వచ్చినప్పుడు వేలాది మంది ఉద్యోగాలు పోతాయని చాలా మంది భయపడ్డారు. భయపెట్టారు. కానీ వాస్తవంలో జరిగింది ఏంటంటే.. కంప్యూటర్ల వల్ల లక్షలాది మందికి ఉద్యోగాలు దొరికాయి. భారతదేశంలో మధ్యతరగతి వర్గం.. కంప్యూటర్ విప్లవం వల్ల ఎగువ మధ్యతరగతి, ధనిక వర్గంలోకి చేరింది. అదే కోవలో ఏఐ కూడా మన జీవనాన్ని మరింత మెరుగుపరుస్తుందని.. అది మనుషుల్ని భర్తీ చేయదని, వారి సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. పనిప్రదేశాల్లో ఏఐ ఏజెంట్లు డిజిటల్ సహోద్యోగులుగా మారి.. తక్కువ సామర్థ్యాలున్నవారు సైతం మరింత మెరుగ్గా పనిచేయగలిగేలా చేస్తాయని స్పష్టం చేశారు. ఉదాహరణకు.. ఒక 100 పేజీల డాక్యుమెంట్‌ను చదివి దాని సారాంశాన్ని అర్థం చేసుకుని, ఆ సారాంశం ఆధారంగా ఒక నిర్ణయం తీసుకోవాలంటే గతంలో ఆ పని చేయడానికి కొన్ని రోజులు పట్టేది. ఇప్పుడు ఏఐకి ఆ డాక్యుమెంట్‌ని ఇస్తే.. క్షణాల్లో దాని సారాంశాన్ని మనకు చెప్పేస్తుంది. దీనివల్ల నిర్ణయాలు తీసుకోవడం వేగవంతమవుతుంది. కాబట్టి.. ఏఐతో ఉద్యోగాలు పోతాయని భయపడక, దాంతో పనిచేయించడం, పనిచేయడం ఎలాగో నేర్చుకుంటే, ఆ సామర్థ్యాలను మెరుగుపరచుకుంటే మరిన్ని అవకాశాలు ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. ఇక.. వైద్యరంగంలో ఇప్పటికే విప్లవం సృష్టిస్తున్న ఏఐ ముున్ముందు మరిన్ని సంచలనాలు నమోదు చేస్తుందని అంచనా. ప్రస్తుతానికి రోగనిర్ధారణకు మాత్రమే ఏఐని వినియోగిస్తున్నారు. ఇకపై దాన్ని చికిత్స ప్రణాళికకు కూడా వినియోగించే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఏఐలో ఆరోగ్యవిభాగం వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ డోమ్నిక్ కింగ్ వంటివారు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 1.1 కోట్ల మంది ఆరోగ్య కార్మికుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని.. ఆ సమస్యను ఏఐ సాయంతో అధిగమించడానికిఅవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఏఐ డయాగ్నస్టిక్ ఆర్కెస్ట్రేటర్ 2025లో అత్యంత క్లిష్టమైన వైద్య సవాళ్లను 85.5 శాతం కచ్చితత్వంతో పరిష్కరించిందని.. ఇది అనుభవజ్ఞులైన వైద్యనిపుణుల సగటు కచ్చితత్వం (20)తో పోలిస్తే చాలా ఎక్కువని ఆయన వెల్లడించారు.ఏఐతో క్వాంటమ్ కంప్యూటింగ్ జత..ఇప్పటికే జోరందుకున్న కృత్రిమ మేధకు.. క్వాంటమ్ కంప్యూటింగ్ శక్తి కూడా తోడైతే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని మైక్రోసాఫ్టలో డిస్కవరీ అండ్ క్వాంటమ్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ చెప్పారు. కంప్యూటింగ్‌కి సంబంధించి తదుపరి ముందడుగు చాలా మంది ఊహిస్తున్నదానికన్నా త్వరలోనే పడబోతోందని.. అందుకు దశాబ్దాలు కాదు, కొన్నేళ్లు మాత్రమే పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఏఐ, సూపర్‌కంప్యూటర్లు, క్వాంటమ్ కంప్యూటర్లు కలిసి పనిచేస్తాయని (హైబ్రీడ్ కంప్యూటింగ్).. మామూలు కంప్యూటర్లకు అసాధ్యమైన పనిని సైతం ఈ హైబ్రీడ్ కంప్యూటింగ్ ద్వారా అవలీలగా, అలవోకగా చేయొచ్చని తెలిపారు. అయితే, ఇంత శక్తి ఉన్న క్వాంటమ్ కంప్యూటింగ్‌కి సంబంధించి శాస్త్రజ్ఞులు ఒక ముఖ్యమైన సవాల్‌ను ఎదుర్కొంటున్నారు. అదేంటంటే.. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కీలకమైన ‘క్యూబిట్లు’ దుర్బలమైనవి. బాహ్య ప్రభావాల వల్ల అవి చాలా త్వరగా అస్థిరతకు గురై పనిచేయకుండా పోతాయి. దీన్ని అధిగమించేందుకు శాస్త్రజ్ఞులు ‘ఫాల్ట్ టోలరెంట్ అల్గారిథమ్స్’.. అంటే బయటి ఒత్తిళ్లకు క్యూబిట్లు ప్రభావితం కాకుండా చూసే అల్గారిథమ్స్‌ను రూపొందిస్తున్నారు. ఆ ప్రయత్నాలు పూర్తిగా సఫలమైతే.. క్వాంటమ్ కంప్యూటింగ్ 2026లోనే వాస్తవ ప్రపంచంలో అందుబాటులోకి వస్తుందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# సబ్బు నీళ్లతో చెక్



పెరటితోటల్లో పురుగుమందుల వాడకం ఏమాత్రం మంచిదికాదు. ఎందుకంటే, అది మన ఆరోగ్యాన్నే దెబ్బతీస్తుంది. అయితే, మొక్కలకు పట్టిన పురుగులు, నల్లి, తెల్ల దోమల్ని నివారించడంలో సబ్బు నీళ్ల ద్రావణం అద్భుతంగా పనిచేస్తుంది. ఇంట్లోనే తయారుచేసుకునే ఈ ద్రావణం.. తక్కువ ఖర్చుతోపాటు ఎక్కువ ప్రయోజనాలు అందిస్తుంది. ఒక లీటర్ నీటిలో తక్కువ గాఢత కలిగిన డిష్‌వాష్ లిక్విడ్ లేదా బేబీ షాంపూను ఒక టీస్పూన్ తీసుకోవాలి.

ఇందులోనే ఒక టీస్పూన్ వేపనూనె లేదా వంట నూనె పోయాలి. దీనివల్ల ద్రావణం మొక్కకు బాగా అంటుకుని ఎక్కువ కాలం పనిచేస్తుంది. ఈ మూడింటినీ మెల్లగా, ఎక్కువ నురగ రాకుండా కలిపి.. ఓ స్ప్రే బాటిల్‌లో నింపుకోవాలి. మొక్కలపై ఈ ద్రావణాన్ని స్ప్రే చేస్తే.. పురుగులు రాకుండా ఉంటాయి. నల్లి, తెల్లదోమలు చనిపోతాయి. అయితే, ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఈ ద్రావణాన్ని స్ప్రే చేయాలి.

ఎండలో స్ప్రే చేస్తే.. ఆకులు వాడిపోయే అవకాశం ఉంటుంది. పురుగులు ఎక్కువగా దాక్కుని ఉండే ఆకుల కిందిభాగంలో ద్రావణం ఎక్కువ స్ప్రే చేయాలి. అయితే, బట్టల సబ్బులు, బ్లీచింగ్ ఉండే డిటర్జెంట్లను వాడకపోవడమే మంచిది. అవి మొక్కల చిగుళ్లను దెబ్బతీస్తాయి. టమాటా, వంకాయ వంటి మొక్కలకు ఈరకమైన ద్రావణం బాగా పనిచేస్తుంది. సబ్బు ద్రావణాన్ని స్ప్రే చేసిన కొన్ని గంటల తర్వాతనైనా, లేకుంటే మరుసటి రోజు ఉదయమైనా మొక్కలపై మామూలు నీళ్లు చల్లితే.. సబ్బు అవశేషాలు తొలగిపోతాయి.

# నిద్రలేమితో హఠాత్తుగా ముందస్తు మధుమేహం

నిద్ర సరిగా పట్టక ఇబ్బంది పడుతున్నారా? అయితే వెంటనే సరిచేసుకోండి. ఎందుకంటే నిద్రలేమి మూలంగా ఆరోగ్యవంతులు రాత్రికి రాత్రే ముందస్తు మధుమేహం (ప్రిడయాబిటిస్) బారినపడే అవకాశమున్నట్టు జర్నల్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురితమైన దీర్ఘకాల అధ్యయనం హెచ్చరిస్తోంది. ముందస్తు మధుమేహంలోనూ రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి. కాకపోతే మధుమేహంగా గుర్తించేంత స్థాయిలో ఉండవు. ఇది ముున్ముందు పూర్తిస్థాయి మధుమేహంగా మారే ప్రమాదముంది. కాబట్టి కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు. వేళకు పడుకోకపోవటం, రాత్రిపూట తరచూ మెలకువ రావటం, నిద్ర సరిగా పట్టకపోవటం మూలంగా గ్లూకోజు మోతాదులను నియంత్రించే హార్మోన్లు అస్తవ్యస్త మవుతాయి. దీంతో పరగడుపున రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి. ఇన్సులిన్ హార్మోన్‌కు కణాలు స్పందించటమూ తగ్గుతుంది. దీంతో కణాల్లోకి గ్లూకోజు సరిగా వెళ్లదు. ఇది రక్తంలోనే ఉండిపోతుంది.

# జీమెయిల్ వాడుతున్నారా?

## ఈ 10 ట్రిక్స్ తప్పక తెలుసుకోండి




ప్రపంచ వ్యాప్తంగా 1.8 బిలియన్లకు పైగా వినియోగదారులు జీమెయిల్‌ను వినియోగిస్తున్నారు. అయినప్పటికీ.. దాని గురించి పూర్తి తెలిసిన వారు.. జీమెయిల్ ఫీచర్స్‌ను వినియోగించుకునే వారు చాలా తక్కువ మందే అని చెప్పాలి. మీరు జీమెయిల్ ఆధారంగా పని చేస్తున్నట్లయితే.. మీ పని విధానాన్ని పూర్తిగా మార్చేసే 10 సీక్రెట్ టిప్స్ ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఈ టిప్స్ ద్వారా మీ సమయం ఆదా అవడంతోపాటు.. జీమెయిల్‌ని సరైన రీతిలో ఉపయోగించవచ్చు.

**1. అన్‌డూ..**మీరు ఎప్పుడైనా అనుకోకుండా అసంపూర్ణంగా ఇమెయిల్‌ని పంపించారా? అయితే, వెంటనే ‘అన్‌డూ’ క్లిక్ చేయండి. మీరు ఇమెయిల్‌ను పంపిన తరువాత దానిని క్యాన్సిల్ చేయడానికి మీకు 30 సెకన్ల సమయం ఉంటుంది. ఈ వ్యవధిలో దానిని అన్‌డూ క్లిక్ చేస్తే.. ఆ మెయిల్ సెంట్ అవ్వదు.

**2. ప్రమోషనల్ మెయిల్స్‌ను తొలగించాలి..**మీ జీమెయిల్ ఇన్‌బాక్స్‌లో అనవసరమైన ప్రకటనలకు సంబంధించి మెయిల్స్ చిరాకు తెప్పిస్తే.. సర్చ్ బార్‌లో ‘బఅంబఎంఓతీఅఎవ’ అని టైప్ చేయండి. అప్పుడు అన్ని మార్కెటింగ్ ఇమెయిల్స్ ఒకే చోటకు వస్తాయి. వాటన్నింటినీ ఒకేసారి క్లియర్ చేసే అవకాశం ఉంటుంది.

**3. కాన్ఫిడెన్షియల్ మోడ్..మీరు ఎవరికైనా సున్నితమైన సమాచారాన్ని పంపిస్తున్నట్లయితే..** ‘కాన్ఫిడెన్షియల్ మోడ్’ని ఉపయోగించండి. ఇమెయిల్ కంపోజ్ చేస్తున్నప్పుడు లాక్ సింబల్ క్లిక్ చేయండి. ఇలా చేయడం వలన ఎవరికైతే మీరు మెయిల్ పంపుతారో వారు మీ సందేశాన్ని కాపీ చేయడం, ఫార్వార్డ్ చేయడం, ప్రింట్ తీసుకోవడానికి అవకాశం లేకుండా ఉంటుంది.

**4. ఇంటర్నెట్ లేకుండా జీమెయిల్ వినియోగం..**ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా కూడా ఇమెయిల్‌లను చదవవచ్చు. అలాగే డ్రాఫ్ట్‌లను కూడా రాయొచ్చు. దీనికోసం.. సెట్టింగ్స్‌లో ఆఫ్‌లైన్ మోడ్‌ని స్టార్ట్ చేయాలి. ఇంటర్నెట్ కనెక్షన్ వచ్చినప్పుడు మీరు చేసిన మార్పులు ఆటోమాటిక్‌గా రీసెట్ అవుతాయి.

**5. ఇమెయిల్‌లను షెడ్యూల్ చేయడం..**మీరు రాత్రి ఆలస్యంగా పని చేస్తూ, ఉదయం మీ ఇమెయిల్ సమయానికి రావాలనుకుంటే.. ఆ ఇమెయిల్‌ను షెడ్యుల్ చేయొచ్చు. వివిధ టైమ్‌లలో పని చేసే వారికి ఈ ఫీచర్ ఎంతగానో ఉపయోపడుతుంది.

**6. ఇమెయిల్‌లను తాత్కాలికంగా ఆపివేయడం..** అలారంను తాత్కాలికంగా ఆపేసినట్లుగానే.. ఇమెయిల్‌లను కూడా తాత్కాలింగ ఆపేసే అవకాశం ఉంది. ఇక ఇమెయిల్ మీకు ఇంపార్టెంట్ కాదనుకోండి.. మీరు దానిని తాత్కాలికంగా ఆపేసే అవకాశం ఉంది. ఆ ఇమెయిల్‌ను ఇన్‌బాక్స్ నుంచి తాత్కాలికంగా తొలగిపోయి.. మీరు ఏదైతే సమయం సెట్ చేస్తారో ఆ సమయంలో మళ్లీ ఇన్‌బాక్స్‌లో కనిపిస్తుంది.


**7. లేబుల్‌లతో ఇమెయిల్‌లను పంపించండి..**జీమెయిల్‌లో ఫోల్డర్‌లకు బదులుగా లేబుల్స్ ఆప్షన్స్ ఉంటాయి. ఆఫీస్, ట్రావెల్, పర్సనల్ వంటి కస్టమ్ లేబుళ్లను క్రియేట్ చేయడం ద్వారా మీ ఇమెయిల్స్ కేటగిరీలుగా డివైడ్ చేసుకోవచ్చు.

8. ఇమెయిల్ టెంప్లేట్ క్రియేట్ చేయండి..మీరు ఒకే రిప్లేను పదే పదే పంపుతున్నట్లయితే.. దానిని టెంప్లేట్‌గా సేవ్ చేసుకోండి. ఇది ఒకే క్లిక్‌తో పూర్తి ఇమెయిల్‌ను కంపోజ్ చేయడానికి యాక్సెస్ ఇస్తుంది. దీనివల్ల మీ సమయం చాలా వరకు ఆదా అవుతుంది.

**9. ఆర్కైవ్..**ఇన్‌బాక్స్ ఫ్రీగా ఉండేందుకు ఇమెయిల్స్‌ను తొలగించడానికి బదులుగా.. వాటిని ఆర్కైవ్ చేయండి. ఇలా చేస్తే ఇమెయిల్స్ ఇన్‌బాక్స్ నుంచి ఆర్కైవ్ ఫోల్డర్‌లోకి వెళ్తుంది. మళ్లీ మీకు అవసరం అయినప్పుడు ఓపెన్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

**10.కీబోర్డ్ షార్ట్‌కట్‌లు..**జీమెయిల్ వినియోగించేవారు కీబోర్ట్ షార్ట్‌కట్‌లు తెలుసుకుంటే మీ పని మరింత సులభతరం అవుతుంది. ఎక్కువ పని చేసే అవకాశం ఉంటుంది. ఇందుకోసం కీబోర్డ్‌లో Shift + ? నొక్కాలి. అన్ని షార్ట్‌కట్‌లు కనిపిస్తాయి.

# థైరాయిడ్ తగ్గించుకోవచ్చు



థైరాయిడో్.మగ-ఆడ తేడా లేకుండా ఇప్పుడు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్యాదీనికి క్రమంతప్పకుండా వైద్యులు సూచించే మందులువాడడం తప్ప మరో గత్యంతరం లేదు. కానీ, ఒక్కోసారి క్రమం తప్పకుండా మందులు వాడకుంటున్నా, థైరాయిడ్ లెవెల్స్ హెచ్చుతగ్గులు అయోమయానికి గురిచేస్తాయి.అయితే, మందులొక్కటే థైరాయిడ్ కంట్రోల్ లో ఉండడానికి పరిష్కారం కాదు. ఇదొక అసామతుల్యత కాబట్టి, సమతుల్యత కోసం అనేక చిట్కాలు పాటించి ప్రయత్నించవచ్చు.అవి కూడా తేలికగా లభించే వంటింటి వస్తువులతో తేలికగా తయారు చేసుకునేవి.అవేమిటో చూద్దామా.

1) రోజూ ఉదయం ఖాళీ కడుపుతో ఒక చెంచా మిరియాల నూనెలో కలిపి తాగండి. ఇది థైరాయిడ్ హార్మోన్లను సమతుల్యం చేసి, జీవక్రియను పెంచుతుంది. ఇది సాధారణ చిట్కా కాదు, మిరియాల యాంటీ-ఇన్ఫ్లమేటరీ శక్తితో గ్రంథిని శుద్ధి చేస్తుంది.

2) రెండు చెంచాల ధనియాలు, గుప్పెడు పుదీనా ఆకులు ఒక గ్లాసు నీటిలో 8 గంటలు నానబెట్టి, వేయించి ఉదయమే తాగితే థైరాయిడ్ వాపును తగ్గించి, థైరాయిడ్ గ్రంథిని బలోపేతం చేస్తుంది.ఇలా రెగ్యులర్ గా తాగడం వల్ల 15 రోజుల్లో మార్పు కనిపిస్తుంది.

3) చిన్న అల్లం ముక్క, చిటికెడు పసుపు, ఒక చెంచా తేనె కలిపి ఉడికించి ఉదయమే తాగండి. ఈ ప్రత్యేక మిశ్రమం థైరాయిడ్ గ్రంథిని ఉత్తేజపూరితం చేస్తుంది..శరీరం బరువును నియంత్రిస్తుంది. .

4) కొత్తిమీర, కలబంద కలిపి రసం చేసుకుని, దానికి జీలకర్ర కలిపి ఉదయమే తాగడం వల్ల టీ ఎస్ హెచ్ లెవల్స్‌ను క్రమంగా తగ్గిస్తుంది. ముఖ్యంగా మహిళలకు బాగా పనిచేస్తుంది ఈ మిశ్రమం

5) ప్రతి రోజు సర్వాంగాసన 5 నిమిషాలు చేసి, కొబ్బరి నూనె గొంతుకు మసాజ్ చేయడం వల్ల థైరాయిడ్‌ను మూలాల నుంచి క్రమబద్ధం చేస్తుంది, శక్తి పుంజుకొన్న అనుభూతి కలుగుతుంది.

# మధుమేహం ఉన్నా పండ్లు తినొచ్చు

మధుమేహం ఉన్నంత మాత్రాన పండ్లు పూర్తిగా మానేయాల్సిన అవసరమేమీ లేదు. అన్ని పండ్లూ చెడ్డవేమీ కాదు. అరటిపండులోనే కాస్త ఎక్కువగా పిండి పదార్థం ఉంటుంది. మిగతావాటిల్లో అంత ఎక్కువేమీ ఉండదు. పండ్లు తిన్న వెంటనే రక్తంలో గ్లూకోజు మోతాదు పెరుగుతుండొచ్చు గానీ అది రోజంతా అలాగే ఏమీ ఉండదు. నిజానికి ఒక మాదిరిగా మొత్తం పండ్లను తింటే గ్లూకోజు నియంత్రణలో ఉండటానికీ తోడ్పడుతుంది. పండ్లు తింటే (పండ్ల రసాలు కాదు) కడుపు నిండిన భావన కలుగుతుంది. పండ్లలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, వాపు నివారకాలు దండిగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ రాకుండానూ కాపాడతాయి. వీటిల్లోని పీచు మూలంగా జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. మల విసర్జన సాఫీగా అవుతుంది. అందువల్ల రోజుకు ఒకట్రెండు పండ్లు తినటం సురక్షితమే. ఆరోగ్యమూ మెరుగవుతుంది.

# iPhone నెమ్మదిస్తోందా? ఒకసారి ఇలా ట్రై చేసి చూడండి



కాలం గడిచేకొద్దీ చాలా మంది తమ ఐఫోన్ పనితీరు నెమ్మదించడాన్ని గమనిస్తుంటారు. ఆ మాటకొస్తే ఫోన్ వాడే ప్రతి ఒక్కరికీ ఇలాంటి అనుభవం ఎప్పుడోకప్పుడు ఎదురయ్యే ఉంటుంది. అయితే, ఐఫోన్ నెమ్మదిస్తోందని అనిపించినప్పుడు ఏం చేయాలనేదానిపై యాపిల్ కొన్ని టిప్స్‌ను పంచుకుంది. వీటిని ఫాలో అయితే తక్షణం సమస్య పరిష్కారం అవుతుందని అనుభవజ్ఞులు చెబుతున్నారు. సాధారణంగా ఫోన్ పనితీరు మెరుగ్గా అనిపించేందుకు ఐఫోన్‌లో యానిమేషన్స్, ట్రాన్సిషన్స్ ఫీచర్లు ఆన్‌లో ఉంటాయి. వీటిని ఆఫ్ చేస్తే ఫోన్‌పై భారం తగ్గి పనితీరు మెరుగవుతుందని యాపిల్ తెలిపింది. ఇందుకోసం సెట్టింట్స్‌లోకి వెళ్లి అందులోని యాక్సెసబిలిటీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తరువాత అందులోని మోషన్ ఆప్షన్‌లోగల రెడ్యూస్ మోషన్ ఫీచర్‌ను ఆన్ చేసుకుంటే తక్షణం ఫలితం కనిపిస్తుంది. గ్రాఫిక్స్‌పై భారం తగ్గి ఫోన్ మరింత వేగవంతంగా, త్వరితంగా స్పందిస్తున్నట్టు అనిపిస్తుంది.ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండిబ్యాక్‌గ్రౌండ్ యాప్ రీఫ్రెష్‌ఫోన్‌లోని యాప్స్ బ్యాక్‌గ్రౌండ్‌లో నిరంతరం రీఫ్రెష్ అవుతుంటాయి. యాప్స్ వాడకపోయినా ఇలా జరుగుతుంటుంది. దీని వల్ల బ్యాటరీ చార్జింగ్ తగ్గిపోవడంతో పాటు ఫోన్ కూడా నెమ్మదిస్తుంది. దీన్ని డిజేబుల్ చేస్తే తక్షణం ఫోన్ పనితీరు మెరుగవుతుందని యాపిల్ చెబుతోంది. దీన్ని ఆఫ్ చేసేందుకు సెట్టింగ్స్‌లోని జనరల్ ఆప్షన్‌ను ఎంచుకుని, అందులోని బ్యాక్‌గ్రౌండ్ రీఫ్రెష్‌ను ‘ఆఫ్’లోకి సెట్ చేసుకోవాలి. దీన్ని వైఫై ఓన్లీ ఆప్షన్‌కు సెట్ చేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.క్యాష్‌ను క్లియర్ చేయడంయాప్స్, ఇతర వెబ్‌సైట్స్‌కు సంబంధించిన సమాచారం ఫోన్‌లో క్యాష్ రూపంలో పేరుకుపోతుంది. క్రమం తప్పకుండా దీన్ని డిలీట్ చేస్తూ ఉంటే ఫోన్ సమర్థవంతంగా పనిచేస్తుంటుంది. ఇందుకోసం యాపిల్ సఫారీ బ్రౌజర్‌లోని సెట్టింగ్స్‌లో క్లియర్ హిస్టరీ అండ్ వెబ్ డాటా ఆప్షన్‌ను ఎంచుకని క్యాష్ డేటా మొత్తాన్ని క్లియర్ చేసుకోవచ్చు. దీంతో ఫోన్‌కు భారంగా మారిన తాత్కాలిక ఫైల్స్, ఇతర డేటా మొత్తం తొలగిపోయి ఫోన్ వేగవంతం అవుతుంది. ఈ టిప్స్‌ను ఫాలో అయితే ఐఫోన్ ప్రాసెసర్ వేగం పెరుగుతుందని యాపిల్ భరోసా ఇస్తోంది.


# మనకే తెలియకుండా జీవితాన్ని మార్చేస్తున్న అలవాటు



కప్పుడు రాత్రి పడుకునే సమయానికి ఒక పద్ధతి ఉండేది. చీకటి పడగానే ఇళ్లలో నిశ్శబ్దం మొదలయ్యేది. భోజనం అయ్యాక కాసేపు మాట్లాడుకుని సహజంగానే నిద్ర వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అలవాటు పూర్తిగా మారిపోయింది. రాత్రి ఎంత అయిందో కూడా గమనించకుండా ఆలస్యంగా పడుకోవడం మన రోజువారీ జీవితంలో భాగమైపోయింది. ఇది చిన్న విషయం అనిపించినా, మన జీవనశైలిని మెల్లగా లోపలినుంచి మార్చేస్తోంది. నిద్ర వేళలు మారడానికి ప్రధాన కారణం మన చేతిలోనే ఉన్న మొబైల్. “ఇంకా ఐదు నిమిషాలే” అంటూ మొదలైన స్క్రీన్ చూడటం అర్ధరాత్రి దాటేవరకు సాగుతోంది. సోషల్ మీడియా, వీడియోలు, ఆన్‌లైన్ పనులు మన మెదడుకు అసలు విశ్రాంతినే ఇవ్వడం లేదు. శరీరం అలసిపోయినా మనసు మాత్రం ఇంకా పరుగులు తీస్తూనే ఉంటుంది. అందుకే నిద్ర రావాల్సిన సమయానికి నిద్ర రాకుండా పోతుంది. నిద్ర ఆలస్యమవడం అంటే కేవలం రాత్రి లేటుగా పడుకోవడమే కాదు. ఉదయం లేవగానే అలసటగా అనిపించడం, తల బరువుగా ఉండటం, చిన్న విషయాలకే చిరాకు రావడం లాంటి సమస్యలు మొదలవుతాయి. పిల్లల్లో ఇది చదువుపై ప్రభావం చూపుతుంది. పెద్దల్లో పని మీద ఏకాగ్రత తగ్గుతుంది. శరీరానికి సరైన విశ్రాంతి దొరకకపోతే మనసు కూడా సరిగా పనిచేయదు. నిద్ర అనేది శరీరానికి ఒక రీస్టార్ట్ లాంటిదన్న విషయం మనం మరిచిపోతున్నాం.ఇంకా లోతుగా చూసుకుంటే, నిద్ర వేళలు మారటం మన శరీరంలో ఉన్న జీవ గడియారాన్ని గందరగోళానికి గురిచేస్తుంది. హార్మోన్లు సరైన సమయంలో విడుదల కాకపోవడం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది, ఒత్తిడి పెరుగుతుంది. ఇవన్నీ ఒక్కరోజులో కనిపించవు. నిద్రను నిర్లక్ష్యం చేసిన ప్రతిరోజూ మెల్లగా మన ఆరోగ్యాన్ని దూరం చేస్తాయి.అయితే ఈ అలవాటును మార్చుకోవడం అసాధ్యం కాదు. రోజూ ఒకే సమయానికి పడుకోవడానికి ప్రయత్నించడం, పడుకునే ముందు మొబైల్‌ను కొంచెం దూరం పెట్టడం, మనసును శాంతింపజేసే అలవాట్లు అలవర్చుకోవడం లాంటి చిన్న మార్పులు చాలానే ఉపయోగపడతాయి. నిద్రను సమయానికి తీసుకుంటే శరీరం మాత్రమే కాదు, ఆలోచనలు కూడా స్పష్టంగా మారతాయి. నిద్ర వేళలు మారుతున్నాయంటే అది కేవలం అలవాటు మార్పు కాదు. మన జీవనశైలి సరైన దారిలో లేదన్న సూచన. ఈరోజు నిద్రకు విలువ ఇస్తే, రేపటి ఆరోగ్యానికి మనమే బలమైన పునాది వేసుకున్నట్టే. సమయానికి నిద్రా ఆరోగ్యమైన జీవితం.

# గోదావరి జిల్లాల సమాచారమ్

## జనాభా ఎంత.. ఇళ్లెన్ని?




**అమలాపురం కలెక్టరేట్** : జనగణన-2027కు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల, పురపాలిక అధికారులకు శిక్షణ ప్రారంభించారు. 2027 జనాభా లెక్కల పరిశోధనాధికారి ఎంబీ రమాదేవి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు.

**తొలిసారి యాప్ ద్వారా వివరాల సేకరణ**

ఈసారి జనగణనను పూర్తిగా మొబైల్ యాప్ ద్వారా సేకరిస్తారు. సీఎంఎఫ్ఎస్, హెచ్ఎల్‌బీసీ వెబ్ అప్లికేషన్ల వినియోగంతో డేటా సేకరణలో వేగవంతం, పారదర్శకత ఉంటుందని అధికారులు తెలిపారు. పౌరులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నేరుగా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించనున్నారు. సాంకేతిక సమస్యలకు ఐటీ, హెల్ప్ డెస్క్, క్షేత్రస్థాయిలో సందేహాల నివృత్తికి ప్రత్యేక సహాయక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. గతంలో మాన్యువల్‌గా దస్త్రాల్లో నమోదు చేసేవారు.

**జిల్లాస్థాయి అధికారులు వీరే..**

జనాభా లెక్కల ప్రధాన అధికారిగా కలెక్టర్, అదనపు అధికారిగా సంయుక్త కలెక్టర్ వ్యవహరిస్తారు. జనాభా లెక్కల అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు అధికారులుగా జిల్లా పంచాయతీ అధికారి, సర్వే, అటవీ, జడ్పీ సీఈవో, డీఈవో, సీపీవో వ్యవహరిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్లు ఛార్జి అధికారులుగా, ఎంపీడీవోలు సహాయ ఛార్జి అధికారులుగా వ్యవహరిస్తారు. పురపాలికల్లో కమిషనర్లు, సహాయక కమిషనర్లు ఇదే హోదాను కలిగి ఉంటారు.

**రెండు దశల్లో..**

తొలిదశలో గృహాల జాబితా, గృహ వసతులు లెక్కిస్తారు. ఈ ఏడాది మే ఒకటి నుంచి ప్రారంభం కానుంది. రెండో దశలో మార్చి 2027 నుంచి వివరాలు సేకరించనున్నారు. మాస్టర్ ట్రైనీగా జిల్లా ముఖ్య ప్రణాళిక విభాగం అధికారి ఎం. మురళీకృష్ణ వ్యవహరించనున్నారు. కులం, ఆదాయం, విద్యార్హత, ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్థితిగతులు, మౌలిక వసతులు, వంటి వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

## డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్

నల్లజర్ల: అతి వేగంగా వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి రాజమహేంద్రవరం నగరానికి క్యాటరింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ను వ్యాన్‌లో శుక్రవారం గుడివాడకు చెందిన కొండ్రు శ్రీనివాస్ (51), విజయవాడకు చెందిన శేషాద్రి, డ్రైవర్ కర్రి శివ తీసుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అతి వేగంగా వెళ్తున్న వ్యాన్ అనంతపల్లి ఎస్వీఆర్ కల్యాణ మండపం వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న కొండ్రు శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన శేషాద్రి, శివలను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన కొండ్రు శ్రీనివాస్ భార్య శైలజ ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటోంది. కుమారుడు కరుణకుమార్, కుమార్తె శ్వేతల బాగోగులు చూసుకుంటూ క్యాటరింగ్ పనులకు వెళ్లి తిరిగి వస్తుంటాడు. ఇదే క్రమంలో రాజమహేంద్రవరం వెళ్తూ మార్గం మధ్యలో చనిపోయాడు. ఎస్సై అంజనేయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఆర్టీసీ పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో తమ నివాస స్థలం నుంచి పరీక్ష కేంద్రాలకు ఉచితంగా ప్రయాణించవచ్చునని జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. ప్రయాణ సమయంలో విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. ఈ మేరకు సిబ్బందికి ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.


**టెన్త్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలి**

ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆల్కాట్‌తోటలోని సత్య సాయి గురుకులంలో శుక్రవారం జిల్లాలోని ఎంఈఓలు, పాఠశాలల హెచ్ఎంలు తదితర అధికారులతో సమీక్షించారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఆయా కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏడీ వెంకటరాజు, డీసీఈబీ కార్యదర్శి దేవా అనిత, కొవ్వూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత విషమంగా కల్తీపాల బాధితుల పరిస్థితి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కల్తీపాల ఘటనలో స్థానిక ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా ఉంది. రోజురోజుకూ వారి ఆరోగ్యం క్షీణిస్తోంది. ఈ ఘటనలో 21 మందికి 10 మంది మృత్యువాత పడగా, 11 మందికి అత్యవసర వైద్య చికిత్సలు అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌కు సంబంధించిన వివరాల ప్రకారం కిమ్స్ బొల్లినేనిలో నలుగురికి వైద్య చికిత్సలు అందిస్తుండగా వారిలో ఇద్దరికి వెంటిలేటర్, ఇద్దరికి వెంటిలేటర్, డయాలసిస్ ప్రక్రియ కొనసాగుతోంది. రెయిన్‌బో చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురూ వెంటిలేటర్, డయాలసిస్‌పై ఉన్నారు. డెల్టా ఆసుపత్రిలో ముగ్గురికి వెంటిలేటర్, డయాలసిస్ ప్రక్రియ కొనసాగుతోంది. రవి చైతన్య కిడ్నీ కేర్‌లో ఒకరికి డయాలసిస్ జరుగుతోంది.

## 25 నుంచి వర్జీనియా పొగాకు కొనుగోళ్లు



దేవరపల్లి: ప్రస్తుత సంవత్సరంలో రైతులు పండించిన పొగాకు కొనుగోళ్లు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శుక్రవారం గుంటూరులో టుబాకో బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు, కొనుగోలు సంస్థలు, బోర్డు అధికాలతో చర్చించి నిర్ణయించారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో ఈ కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు రీజనల్ మేనేజరు జె.సుందర కుమార్ తెలిపారు. రీజియన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**29,132 హెక్టార్లలో సాగు**

2025ఉ26 సంవత్సరానికి రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో 12,612 మంది రైతులు 29,132 హెక్టార్లలో పొగాకు పండించారు. 14,417 బ్యారన్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో 47.29 మిలియన్ల కిలోలు, తొర్రేడు ప్రాంతంలో పండిస్తున్న ఎన్‌బీఎస్ 2.03 మిలియన్ల కిలోలు మొత్తంగా 49.32 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతించింది. అయితే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినందున ఉత్పత్తి పెరుగుతుందని అధికారులు, ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాది 61.27 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 83.88 మిలియన్ల కిలోలు పండించారు. కిలో సగటు ధర రూ.311, గరిష్ఠ ధర రూ.453 రైతులకు లభించడంతో మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా మార్కెట్ ఆశాజనకంగా

## ఇంటికి దీపం.. వ్యాయామానికి దూరం..



**కంబాలచెరువు:** మారిన జీవనశైలి నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కొంతమంది నడక, రన్నింగ్ వంటివి చేస్తున్నా దీర్ఘకాలంలో కొనసాగించట్లేదు. అతి కొద్దిమంది మాత్రమే తమ దైనందిన జీవితంలో భాగం చేసుకున్నారు. రోజూ వ్యాయామశాల(జిమ్)కు వెళ్లి తమ శరీరానికి అనుగుణమైన కసరత్తులు చేస్తున్నారు. అందులో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది.

**ఉమ్మడి జిల్లా పరిధిలో..**

రాజమహేంద్రవరం, కాకినాడ వంటి ఒక్కో నగరంలో చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు 30 జిమ్‌లు ఉన్నాయి. ఇక్కడ ఒక జిమ్‌కు సుమారు 100 మంది పురుషులు వ్యాయామానికి వెళ్తుంటే మహిళలు 10లోపే ఉంటున్నారు. కొన్నిచోట్ల అది కూడా ఉండట్లేదు. అమలాపురం, తుని, మండపేట, రామచంద్రపురం వంటి పట్టణాల్లో 5 నుంచి 10 వ్యాయామశాలలు ఉండగా వెళ్లే మహిళల సంఖ్య 5 నుంచి 10లోపే ఉంటోంది.

**వారు వెళ్తున్నా..**

నూతన సంవత్సరం, పుట్టినరోజు వంటి ప్రత్యేక తేదీల్లో కొంతమంది ఎంతో ఆసక్తితో మొదలుపెట్టినా సుదీర్ఘకాలం కొనసాగించట్లేదు. అనారోగ్య కారణాలు, బరువు తగ్గడం, డైట్ కోసం మరికొంత మంది జిమ్‌లో చేరినా కొన్ని నెలలకే మానేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లోని ఉద్యానాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి, అందులో కొన్ని పరికరాలు ఏర్పాటు చేసింది. పరిసరాల్లోని మహిళలు వారానికి 3 నుంచి 4 రోజులు వెళ్లి వ్యాయామం చేస్తున్నారు.

**బాధ్యతల బంధాలు..**

చాలామంది వనతలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపట్లేదు.
ఉన్నత చదువులు అభ్యసించిన వారు, ఉద్యోగాలు చేస్తున్నవారిలో ఆసక్తి ఉన్నా వివిధ కారణాలతో వెళ్లట్లేదు.
పిల్లలు, కుటుంబ బాధ్యతలు, ఇంటిపనులు, వృద్ధులు ఉంటే వారికి సపర్యలు వంటి వాటికే పరిమితం అవుతున్నారు.
ఉద్యోగం, వ్యాపారం చేస్తున్న వారైతే ఖాళీ సమయమే ఉండట్లేదని తేల్చేస్తున్నారు.
ఆరోగ్యరీత్యా చేద్దామన్నా ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనకడుగు వేస్తున్నారు.

**నిత్యం ఉత్సాహంగా..**

రోజంతా ఏవేవో పనులు ఉన్నాయని జిమ్‌కు వెళ్లడానికి చాలామంది ఆసక్తి చూపరు. రోజూ వ్యాయామం, వాకింగ్‌తో అనారోగ్య సమస్యలు దాదాపు దరిచేరవు. ఆరు నెలలుగా జిమ్‌కు వెళ్తున్నా. బరువు తగ్గడంతోపాటు రోజంతా ఉత్సాహంగా ఉంటున్నా.

**పార్వతి, రాజమహేంద్రవరం**

**జీవితంలో భాగమయ్యేలా..**

వ్యాయామంతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. జీవనశైలిలో ఎదురయ్యే హార్మోన్ల అసమతుల్యం, పీసీవోడీ, థైరాయిడ్, మధుమేహం వంటివి అదుపులో ఉంచుకోవచ్చు. భవిష్యత్తులోనూ రాకుండా ఉండొచ్చు. ముఖ్యంగా 35 ఏళ్లు దాటిన మహిళల్లో ఎముకల బలం తగ్గి ఇబ్బందులు పడుతున్నారు. ఆ తరహా సమస్యలకు చెక్ పెట్టొచ్చు.

**డాక్టర్ పద్మజ, సీనియర్ గైనకాలజిస్టు, రాజమహేంద్రవరం**

## వైకాపా ప్రభుత్వ హయాంలో ఎల్ఎంసీ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం



రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖ అవసరాలు తీర్చాలన్న లక్ష్యంతో చేపట్టిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) పనులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో తీవ్ర అలక్ష్యానికి గురయ్యాయి. నాడు కనీస పురోగతి లేదని కాగ్ (మార్చి 2023) నివేదిక స్పష్టం చేస్తోంది. తాజా నివేదికలో తూర్పారబట్టింది.

**ఇదీ లక్ష్యం.. ఎడతెగని జాప్యం**

నేలకోట జలాశయం నుంచి 211.27 కి.మీ మేర ప్రవహించి పూర్వపు తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో 1.62 లక్షల ఎకరాలకు సాగునీరు.. విశాఖ నగర పారిశ్రామిక, ప్రజల అవసరాలకు 23.44 టీఎంసీలు అందించాలన్నది ఎడమ ప్రధాన కాలువ లక్ష్యం. 2005లో పనులు ప్రారంభించి 2007కు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో రూ.2233.34 కోట్ల ఒప్పంద విలువతో గుత్తేదారుకు అప్పగించారు. ఇన్నేళ్లలో రూ.2076.10 కోట్లు ఖర్చు చేసినా పనులు అసంపూర్తిగా ఉన్నాయని పేర్కొంది.

**పనుల తీరు.. పరిశీలిస్తే...**

కాలువ పొడవునా 211.27 కి.మీ మేర మట్టి తవ్వాల్సి ఉండగా రూ.506.57 కోట్లతో 171.15 కి.మీ.తవ్వకాలు చేపట్టారు.
ప్రతిపాదిత 209.99 కి.మీ మేర లైనింగ్ పనుల్లో రూ.414.77 కోట్లతో 131.98 కి.మీ మాత్రమే చేశారు.
వైకాపా అధికారంలోకి వచ్చాక గుత్తేదారుల తొలగింపు, కొత్తవారికి కేటాయింపుతో మార్చి 2023 వరకు పనులు ఎవరికీ అప్పగించలేదు. దీంతో అంచనాలు రూ.2373 కోట్ల నుంచి రూ.4202.69 కోట్లకు పెంచుతూ గత ప్రభుత్వం ప్రతిపాదించగా వ్యయ పరిమితి పెరిగిందని ఆర్‌సీసీ కమిటీ అభిప్రాయపడింది. దీంతో ఆ పనులు నిలిచాయి. పూర్తిచేయకపోతే ఖర్చు చేసిన రూ.2076.10 కోట్లు వృథా అయ్యే ప్రమాదముందని కాగ్ హెచ్చరించింది.

**భూసేకరణలోనూ అదేతీరు..**

ఎల్ఎంసీలో 73.168 కి.మీ వద్ద అండర్ టన్నెల్ నిర్మాణానికి 2005లోనే గుత్తేదారుకు పనుల బాధ్యత అప్పగించారు. 10.75 ఎకరాల భూమిని 2018లో రూ.91.96 లక్షలతో సేకరించారు. పరిహారం పెంచాలని రైతులు నిరసన చేపట్టడంతో 2023 మార్చి వరకు భూస్వాధీన ప్రక్రియ పూర్తవలేదు. పరిష్కారానికి వైకాపా ప్రభుత్వం ప్రయత్నించలేదని కాగ్ తప్పుబట్టింది.

**బాధ్యతలు అప్పగించడంలోనూ..**

ఎడమ కాలువ పదహారో నంబరు జాతీయ రహదారిని 11 ప్రాంతాల్లో దాటుతుందని తెలిసినా పట్టించుకోలేదు. ఆ తరువాత క్రాసింగ్‌ల వద్ద 8 చోట్ల పనుల బాధ్యతను ఎన్‌హెచ్‌ఏకు పదకొండేళ్ల తరువాత అప్పగించారు. రూ.113.68 కోట్ల అదనపు భారం ఖజానాపై పడింది.

**మట్టి విక్రయంలో తాత్సారం..**

కాలువ పరిధిలోని అన్ని ప్యాకేజీల వద్ద రూ.1,091.58 కోట్ల విలువైన (7.9 కోట్ల ఘనపు మీటర్ల) మట్టి అందుబాటులో ఉన్నా విక్రయించకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొంది.

## కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం



ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి కాలువలో దూసుకువెళ్లిపోవడంతో ఒకరు గల్లంతైన ఘటన శుక్రవారం సాయంత్రం ఏలేశ్వరంలో జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న మరోవ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలివి.. ఏలేశ్వరం క్వారీ పేటకు చెందిన బంగర్తి విజయ్, గిడుతూరి లోవరాజు క్వారీ పనులకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. ఏలేశ్వరం-సి.రాయవరం మధ్య మలుపు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి ఏలేరు ఎడమ కాలువలో పడిపోయారు. ఈ ప్రమాదంలో లోవరాజు (41) కాలువలో గల్లంతయ్యారు. విజయ్‌కు గాయాలవ్వగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. ఈ ఘటనపై ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాయుడు చిన్న తెలిపారు.

**కుటుంబం కన్నీరుమున్నీరు..**

లోవరాజు ఆచూకీ కోసం ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. అతనికి భార్య నాగమణి, 15, 16 ఏళ్ల కుమార్తెలు ఇద్దరు ఉన్నారు. ఆ కుటుంబానికి అతని కష్టార్జితమే ఆధారం. తన ఆచూకీ కోసం కాలువ వద్దకు వచ్చిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## సెక్యూరిటీ గార్డులపై దాడి.. ఇద్దరికి గాయాలు



మసీదుసెంటర్, న్యూస్‌టుడే: జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డులపై కొందరు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం మెడికల్ విభాగం వద్ద చోటుచేసుకుంది. కాకినాడ జీజీహెచ్‌లో గత కొంత కాలంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతానికి చెందిన కాటూరు రాజు, గోలీలపేటకు చెందిన పి.రామలక్ష్మి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వీరిలో కొంత మంది ఓ కార్మిక సంఘంలో, మరికొంత మంది మరో సంఘంలో సభ్యులుగా ఉన్నారు. ఇటీవల సెక్యూరిటీ గార్డు రాజుకి, మరో మహిళాగార్డుకు మధ్య వ్యక్తిగత వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే శుక్రవారం విధుల్లో ఉన్న రాజుపై ఆ మహిళకు సంబంధించిన బయట వ్యక్తులు వచ్చి దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న రామలక్ష్మి అనే ఆమెను కూడా కొట్టారు. వీరు గాయపడడంతో జీజీహెచ్ అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో దాడిని నిరసిస్తూ అత్యవసర విభాగం వద్ద సెక్యూరిటీ గార్డులు ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి అధికారులు వచ్చి వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాజానగరం, న్యూస్‌టుడే: బంధువులను కలిసి తిరిగి వెళ్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటనలో అతని బండి కాలిపోయింది. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం గ్రామీణం కొంతమూరు శానిటోరియం ప్రాంతానికి చెందిన అందే అఖిల్‌కుమార్(30)కు వివాహమైంది. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు గృహోపకరణాల దుకాణంలో పనిచేస్తున్నాడు. బంధువులను కలిసేందుకు శుక్రవారం ఉదయం రాజానగరం వెళ్లారు. తిరిగి వస్తుండగా జాతీయ రహదారిపై బ్రిడ్జికౌంటీ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అఖిల్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతని బండిని ఢీకొన్న వాహనం కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో పెట్రోల్ ట్యాంకు నుంచి మంటలు చెలరేగి దగ్ధమైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## యుద్ధం.. బిక్కుబిక్కుమంటూ జీవనం



**రాజోలు :** ఇజ్రాయెల్‌పై జరుతున్న బాంబుల దాడితో అక్కడ ఉన్న తెలుగు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పొట్టకూటి కోసం పరాయి దేశం వెళ్లిన వారంతా ప్రాణభయంతో అల్లాడిపోతున్నారు. రాజోలు దీవి నుంచి వెళ్లిన సుమారు 200 మంది ఇజ్రాయెల్‌లోని హెర్జిలియా నోఫియంలో వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు రోజులుగా బాంబుల మోతలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

**బంకర్లలో దాక్కుని బతుకుతున్నాం**

నేను రెండేళ్ల నుంచి ఇజ్రాయెల్‌లో ఉంటున్నాను. ఇంత భయంకరమైన పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. రెండు రోజులుగా బాంబుల మోతతో హడలెత్తిపోతున్నాం. యుద్ధానికి ముందు సైరెన్ మోగగానే మేమంతా బంకర్లలో తలదాచుకుంటున్నాం. అనంతరం మళ్లీ సైరన్ మోగిన తరువాత బయటకి వస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలకు సెలవులు ప్రకటించగా మేము మాత్రం విధుల్లోనే అంటున్నాం

## మీనాక్షి తళుక్కు.. సంతోషాల చమక్కు




**రాజానగరం:** 'హలో రాజమహేంద్రవరం' అంటూ ప్రముఖ కథానాయిక మీనాక్షి చౌదరి సందడి చేశారు. రాజానగరంలోని జీజీయూలో మైత్రి యువజనోత్సవాలు శుక్రవారంగా వేడుకగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. ఆటపాటలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు ఉరకలేసే ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన వేడుకలో మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. యువతీ యువకులతో కలిసి నృత్యం చేశారు.

## ప్రమాదాలకు నిలయంగా మన్యం



రంపచోడవరం: ప్రకృతి అందాలకు నిలయమైన మన్యంలో రోడ్డు ప్రమాదాలు అనేక మంది ప్రాణాలను హరిస్తున్నాయి. మితిమీరిన వేగం.. ఆపై మలుపులపై అవగాహన లేకపోవడం.. మద్యం మత్తులో ప్రయాణంతో ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. జిల్లాలో రంపచోడవరం, మారేడుమిల్లి అందాలు చూసేందుకు అనేక మంది వచ్చి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాలను నివారణకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు కూడా నిర్వహిస్తున్నా, ఎక్కడ తగ్గడం లేదు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం వైపున పోక్సుపేట వద్ద ఏజెన్సీ ముఖ ద్వారం ప్రారంభమవుతోంది. గోకవరం ఉ రంపచోడవరం రోడ్డులో అనేక చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతానికి బైక్‌లపై వచ్చేవారు వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. గోకవరం నుంచి రంపచోడవరం గ్రామానికి 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది. పోక్సుపేట దాటిన వెంటనే చిన్నబాపనమ్మ తల్లి గుడి వద్ద ప్రమాదకర మలుపు ఉంది. తరువాత ఏఉ1 రిసార్ట్స్ వద్ద మరో మలుపు ఆందోళనకు గురిచేస్తోంది. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నరసాపురం దాటిన తరువాత రోడ్డు ఎక్కువ దూరం దిగుడుగా ఉండి ఒక పెద్ద మలుపు ఉంటుంది. సీతపల్లి గుడి తర్వాత ప్రమాదకర మలుపు ఉంది. గతంలో ఇక్కడ అనేక మంది మృత్యువాత పడ్డారు. వేగంగా వచ్చే వాహనదారులు దగ్గర మలుపు కావడంతో కంట్రోల్ చేయలేక ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఐ.పోలవరం గ్రామానికి సమీపంలోని పాలకాలవ దగ్గరలో, జాగరంపల్లి జంక్షన్ వద్ద మలుపులు ఉన్నాయి. రంపచోడవరంఉ గోకవరం రోడ్డులో ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి. తాజాగా ఏడుగురాళ్లపల్లికి చెందిన ఇద్దరు సచివాలయ ఉద్యోగులు పాలకాలువ సమీపంలో వాహనాన్ని ఢీకొని మృతి చెందారు. ఇదే మలుపులో బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. రంపచోడవరం ఉమారేడుమిల్లి మార్గంలోనూ మలుపులు హడలెత్తిస్తున్నాయి. రంపచోడవరం అటవీశాఖ చెక్‌పోస్టు, ఏపీఆర్ కళాశాల వద్ద ప్రమాదకర మలుపు ఉంది. మారేడుమిల్లి రోడ్డులో అనేక చోట్ల టర్నింగ్ పాయింట్‌లు ఉన్నాయి. గెద్దాడ గ్రామం దాటిన తరువాత సీమగండి వద్ద ఒంపుగా మలుపు ఉంది. ఇక్కడ అనేక ప్రమాదాలు జరిగాయి. సున్నంపాడు ఉ దేవరపల్లి వద్ద కూడా ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. మారేడుమిల్లి నుంచి వస్తూ అనేక మంది పర్యాటకులు ప్రమాదాల బారిన పడ్డారు. తాజాగా మారేడుమిల్లి రోడ్డులో దేవరపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో వైటీసీ మేనేజర్ మృతి చెందారు.

**ఘాట్ రోడ్లలోనూ..**

మారేడుమిల్లి చింతూరు ఘాట్ రోడ్డులో అనేక చోట్ల భద్రతా చర్యలు లేవు. దీంతో వాహనాలు లోయలో ప డి ఎందరో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉ న్నాయి. పాములేరు నుంచి ప్రారంభమయ్యే ఘాట్ రోడ్డు 22 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డులో అనేక చోట్ల ప్రమాదకర పరిస్థితులు ఉన్నా పట్టించుకునే నా ౽ థుడే లేదు. ఇటీవల ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడి అనేక మంది మృత్యువాత పడ్డారు. గతంలో కర్ణాటకాకు చెందిన యాత్రికుల మినీ బస్సు ఘాట్ రోడ్డు లో పైమలుపు నుంచి అదుపుతప్పి కిందపడి ఏడుగురు వరకూ ప్రాణాలు కోల్పోయారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా కనీస చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. అనేక చోట్ల రక్షణ గోడలు, ఐరన్ గడ్డర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికై నా ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# జన సైనికుల ఉద్యమి సభ్యత్వం విజయవంతం

**తాళ్లపూడి విశాఖ సమాచారం :ప్రతినిధి( శివ కృష్ణ )**

తాళ్లపూడి పట్టణ జనసేన అధ్యక్షులు అయితం మణికంఠ ఆధ్వర్యంలో తాళ్లపూడి బస్టాండ్ ప్రాంతంలో జనసేన ఉద్యమి సభ్యత్వ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ టీ వీ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు తాళ్లపూడి మండలంలో 1000 సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందని అన్నారు. శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దాదాపు 200 మంది జనసేన సభ్యత్వం తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతు పుప్పాల సత్యనారాయణ, జనసేన నాయకులు కల్లూరి సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శులు దూసన పూడి రామాంజనేయులు, పోతుల దుర్గా ప్రసాద్,



పెద్దేవం గ్రామ అధ్యక్షుడు నామన బురయ్య, జనసేన సీనియర్ నాయకులు రాగు వీర్రాజు, సీర్ల సూర్యచంద్రం, మెన్నీ సత్తిబాబు, బరిగంటి శ్రీను, బుద్దాల గాంధీ, ప్రక్కిలంక ఉపసర్పంచ్ విత్తం నాని, వేగేశ్వరపురం గ్రామ అధ్యక్షులు దేవన సత్తిబాబు, పోచరం అధ్యక్షులు కాకర్ల సురేష్, గజ్జరం అధ్యక్షులు అవుడు కృష్ణ, జనసేన వీరమహిలా బండారు నాగ కుమారి, గంగాణకుర్తి సీతారామన్న, దూడల పోసిబాబు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పెద్దాపురం నందు కాకిపోసియ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు పాఠశాల మరియు ఎక్స్ అఫీషియో సభ్యులైన కొర్లపాటి అన్నవరం పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, ఎస్ఎంసి వైస్ చైర్మన్, వంట ఏజెన్సీ నిర్వాహకులు, పారిశుద్ధ్య కార్మికురాలు మొత్తం ఐదుగురు మహిళలకు దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి అన్నవరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు విద్యా వైద్య సాంకేతిక రాజకీయ రంగాలలో అన్నింటిలోనూ ముందుంటున్నారని అన్నారు. స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవతలు కొలువుతీరి ఉంటారని అన్నారు. స్త్రీ



లేనిదే జననం లేదని లోకమే లేదని కనుక విద్యార్థులందరూ అమ్మని పూజించాలని అన్నారు. అమ్మ విలువ తెలుసుకుని గ్రామానికి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నమని, సనఫల రాజశేఖర్ మానవత సెక్రెటరీ జుత్తిగా సూర్యచంద్రం, సి ఆర్ పి కొయ్య నాగరాజు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# ఎర్రంపాలెం ఎంపీపీ పాఠశాల వద్ద

## కట్టెల పొయ్యిపైనే వంట



**రంపచోడవరం విశాఖ సమాచారం :** ఎన్నో ఆశల నడుమ కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటైంది. ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని అందరూ భావించారు. కానీ ఇక్కడ వి ద్యార్థుల కష్టాలు తీర్చే నాథుడే లేకపోయారు. పాఠశాలలు, వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. జిల్లాలో 79 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 16,238 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక 15 వసతి గృహాల్లో 1,281 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అయితే జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో కట్టెల పొయ్యిలపైనే విద్యార్థులకు భోజనాలను తయారు చేస్తున్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు గ్యాస్ సిలిండర్లను ఉయోగించి వంటలు చేసుకుంటున్నా, ఇక్కడ మాత్రం ఇంకా కట్టెల పొయ్యిలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఏళ్ల కాలంగా ఈ పరిస్థితి ఉంది.

**కంట్లో పొగ.. ఇదో సెగ**

పాఠశాలల భవనాల పక్కనే కట్టెల పొయ్యిపై విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు. వంట సమయంలో వెలువడుతున్న పొగతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. పొగ కారణంగా చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. వంట షెడ్లను నిర్మించకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. చాలా చోట్ల తరగతి గదులకు దగ్గరలోనే వంట చేయడంతో విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలోని ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు గ్యాస్ సరఫరా చేయడం లేదు. అన్ని చోట్లా కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నారు.

**ఇష్టారాజ్యం**

వంట కోసం గ్యాస్ అందించాలని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులు కోరుతున్నా, ఫలితం లేకుండా పోతోంది. కట్టెల పొయ్యి కారణంగా పొగచూరి ఆహార పదార్థాలకు పట్టడంతో ఒక్కోసారి తినడానికి ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. గతంలో ఆశ్రమ పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేశారు. కొన్ని నెలలు తర్వాత ఎక్కడా అవి కనిపించలేదు.

కనీసం ఆయా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన లెక్కలే లేవు. కాగా.. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించిన ఖాళీ గోనె సంచులు, విద్యార్థులు ఉపయోగించి, పాడైన ఐరన్ పెట్టెలు, పాత పుస్తకాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఫలసాయం డబ్బులను ట్రెజరీ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ పద్దులో జమ అయ్యేటట్లు బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ ఎక్కడా ఇదీ జరగడం లేదు. తమ ఇష్టారాజ్యంగా వార్డెన్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ప్రతిపాదనలు పంపించాం**

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గ్యాస్‌పైనే వంట చేసే విధంగా సిలిండర్ల సరఫరాకు ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌కు ఇక్కడి పరిస్థితిపై నివేదిక అందజేశాం. ప్రస్తుతం అన్ని చోట్లా గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం ఉంది. జీసీసీ ద్వారానే గ్యాస్ సరఫరా చేసే అంశాలను ఆలోచన చేస్తున్నాం.

**ఉ రుక్మాంగదయ్య, డీడీ, రంపచోడవరం**

**ఇబ్బంది పడుతున్నాం**


ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు నెలకు ఒక్క సిలిండర్ మాత్రమే ఇస్తున్నారు. దీంతో రెండు వారాలకే అది ఖాళీ అవుతోంది. ఆ తర్వాత కట్టెల పొయ్యిపైనే వంట చేయాలి. కట్టెల పొయ్యిపై వంట చేయడం వలన పొగ వచ్చి ఇబ్బంది పడుతున్నాం. నెలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తే బాగుంటుంది. ఉ లక్ష్మి, వంటమనిషి, ఎంపీపీ స్కూల్, ఎర్రంపాలెం

**పొగతో ఆరోగ్యానికి ముప్పు**

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కట్టెల పొయ్యిపై వంట చేసి భోజనం పెడుతున్నాం. దీని వల్ల పొగతో చాలా ఇబ్బంది పడుతున్నాం. కళ్లు పాడైన వారు, ఊపిరితిత్తులు పాడైన వారు కూడా ఉన్నారు. కట్టెల పొయ్యిపై వంట చేసే బాధను తప్పించాలి. ఉ జమయమ్మ, ఆశ్రమ పాఠశాల, గంగవరం

# మన వీధి మన బాధ్యత కార్యక్రమం

**సాలూరు విశాఖ సమాచారం** సాలూరు మున్సిపాలిటీ పరిధిలో 24 వ వార్డు మన వీధి మన బాధ్యత కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ టి రత్నకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వార్డులో ప్రజలను ఉద్దేశిస్తూ కమిషనర్ రత్నకుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి శనివారం మన వీధి మన బాధ్యత క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు తడి చెత్త పొడి చెత్త ను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఇంటికి వచ్చిన సమయంలో మున్సిపల్ ట్రాక్టర్ లో తడి చెత్తను వేయాలని అన్నారు పరిసర ప్రాంతాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలని వార్డు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేకపోతే ఈగలు దోమలు పెరిగి మలేరియా టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచే ప్రతి ఒక్కరు ఇంటి వద్ద డస్ట్ బిన్ను ఉంచుకొని వ్యర్థ పదార్థాలు వాటిలో వేయాలని కోరారు ఈ కార్యక్రమానికి సానిటీ ఇన్స్పెక్టర్ ఎల్ బాలకృష్ణ కమిషనర్ టి రత్నకుమార్ ఆధ్వర్యంలో మన వీధి మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు




# ఇరాన్ - యుఎస్ఏ యుద్ధం: పరిణామాలు పై సెమినార్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో "ఇరాన్ మరియు యునైటెడ్ స్టేట్స్ మధ్య భౌగోళిక రాజకీయ పోటీ: కారణాలు, పరిణామాలు మరియు ప్రపంచ ప్రభావాలు" అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ అంశంపై ముందుగా విభాగపు శాఖాధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ – ఇశ్రాయేల్ తో కలిసి ఇరాన్ పై దాడులు జరిపి ఆ దేశపు సుప్రీమ్ అయితుల్లా ఖమేనీ సహా పదుల సంఖ్యలో ఉన్నతాధికారులని , మాజీ దేశ అధ్యక్షుడుని , వందలాది పౌరుల్ని పొట్టన పెట్టుకోవడం , ఆవాసాలను ధ్వంసం చేయడం అమెరికా దుందుడుకు వైఖరికి నిదర్శనం అన్నారు. పశ్చిమాసియాని నేరుగా అమెరికా యుద్ధ రంగంగా మార్చేయడం ఖండనీయమని అన్నారు. ట్రంపు ఇప్పటికే తన విధానాల ద్వారా ఏ యుద్ధమైనా , ఎవరి పైన అయినా, ఎప్పుడైనా చేస్తానంటూ ఆయన హుంకరిస్తే , అందుకు ప్రపంచ దేశాలు మౌనం వహిస్తే ఆ దోరణితో బలహీన దేశాలు బలిపీఠం ఎక్కుతాయి. కొత్త తీవ్రవాదం పుట్టుకు వస్తుంది , ఆర్థిక వ్యవస్థ , భద్రత , ప్రగతి గాలిలో




కలుగజేస్తాయి కాబట్టి శాంతి చర్చల ద్వారా యుద్ధ వాతావరణంను ఆపు చేయాలన్నారు. ఇంకా ఈ సెమినార్ లో విద్యార్థులు నూతన్, శ్రీ, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.కె.సత్యనారాయణ, డా.హరీష్, డా.రత్నరాజు, డా.నాగరాజు, ప్రియాంక, పీవీ



దీపాలు అవుతాయి. అందుకనే ఇరాన్ పై దాడిని అందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన సందర్భం ఇది అని చెప్పారు. యుద్ధాలు జరగడం మానవాళికి తీవ్ర మైన నష్టాల్ని రామ్, రాయ్ తదితరులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎవరి కోసం శతాబ్ది ఉత్సవాలు?

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో అతిథి అధ్యాపకులు చేస్తున్నటువంటి నిరసన దీక్షలు ఈ రోజుకి 21వ రోజుకి చేరినవి. ముఖ్యంగా ఈరోజు సిపిఐ ఎం జీ ఫ్లోర్ లీడర్ జీవీఎంసీ డాక్టర్. బి. గంగారాం నిరసన దీక్షకు వద్దకు వచ్చి మద్దతు పలికారు. ముఖ్యంగా అతిథి అధ్యాపకులకు నెలవారి జీతాలు



ఇప్పించాలని మరియు వెట్టి చాకిరిని నిర్మూలించాలని ఈ సందర్భంగా అతిథి అధ్యాపకులను ఉద్దేశించి తెలియ జేశారు. అదేవిధంగా అతిథి అధ్యాపకుల కు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ఉత్తరం ద్వారా విన్నవించారు. ఆంధ్ర యూనివర్సిటీ అధికారులు అధ్యాపకులతో చర్చలు జరిపారు . పేపర్ వైజ్ రెన్యుమరేషన్ వద్దు నెలవారి ముద్దు అని అందరూ ఏయు అధికారులకు తెలియజేశారు. ముఖ్యంగా శత జయంతి ఉత్సవాలు అనేవి ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తున్న రోజువారి పని వారు 28 రోజులు వారు, మరియు అతిథి అధ్యాపకులకు అందరికీ న్యాయం జరిగే విధంగా జీూజ గా ఏర్పడి సమస్యలను పరిష్కరించుకోవలసిన అవసరం ఉందని అతిథి అధ్యపకుల అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మీనన్ తెలియజేశారు . అదే రకంగా లోకల్ రాజకీయ నాయకులు ముఖ్యంగా ఎమ్మెల్యేలు , ఎంపీలు చొరవ తీసుకొని ఈ సమస్యని పరిష్కరించవలసిన అవసరం ఉందని యూనివర్సిటీ మేధావులు కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు డాక్టర్ ప్రసాద్, కిరణ్ వీరేందర్ , అంబేద్కర్, విక్రమ్ , పీవీ రామ్, రవి, ,సునీత, పవన్ ,మురళి ,దివ్య, దేవదానం, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

# తనిఖీలు నిర్వహించిన కమిషనర్ మల్లయ్య నాయుడు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** 27 వార్డులో ఇంటి పనులు మరియు కొళాయి పనులు భారీ తనిఖీలు నిర్వహించిన కమిషనర్ మల్లయ్య నాయుడు,,,, 06.03.2026 న ఉదయం, సౌత్ జోన్ కు సంబంధించిన 27వ వార్డు 1086143 సచివాలయం పరిధిలో జోనల్ కమిషనర్ వీ.మల్లయ్య నాయుడు మరియు రెవెన్యూ ఆఫీసర్ TSN రాజు మరియు బిల్లు కలెక్టర్ K రామ్ బాబు, వాటర్ సప్లై ఏఈ విజయ్ కుమార్ గారి ఆధ్వర్యంలో దొండపర్తి ఏరియా నందు ఇంటి పన్ను మరియు కొళాయి పన్ను అధికంగా బకాయి ఉన్నవారి కొలాయిలు వాటర్ టాప్ 10 డిస్కనెక్ట్ చేసి ఉన్నారు. కాగా తదుపరి చర్యగా పవర్ డిస్కం APEPDCL వారికి నోట్ జారీ చేయాలని, జోనల్ కమిషనర్



వారు ఆదేశాలు ఇవ్వటం జరిగినది. ఇదిలా ఉండగా కొంతమంది ప్రజలు ఇంటి పన్నును GVMC వారు అవకాశం కల్పించిన Billdesk లింక్ ద్వారా సత్వర పేమెంట్స్ చేయటం జరిగినది.

# వేట్లపాలెం ఘటనలో మరో ఇద్దరి మృతి



**సామర్లకోట విశాఖ సమాచారం :** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్‌లో ఇటీవల జరిగిన ఘోర విస్ఫోటనంలో మృతుల సంఖ్య 28కి పెరిగింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పెద్దాపురానికి చెందిన మోర్త శ్రీను (30), వేట్లపాలేనికి చెందిన సప్ప సత్యవేణి (34) మృతి చెందారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో అక్కడికక్కడే 20 మంది సజీవ దహనమైన విషయం విదితమే. ఇదే ప్రమాదంలో గాయపడిన 9 మందిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇప్పటి వరకూ 8 మంది మృతి చెందారు. సామర్లకోట కుమ్మర వీధికి చెందిన వేమగిరి దావీదు మృత్యువుతో పోరాడుతున్నాడు.

# జయహో జనయిత్రి




- **మమతాను రాగాలకు చిరునామా మహిళ**
- **ఉమెన్స్ డే అవార్డుల ప్రధానోత్సవములో అతిథులు**

**డాబాగార్డెన్స్ (విశాఖ సమాచారం):**

విద్యా,విజ్ఞాన, సామాజిక సేవా రంగాల్లో అత్యున్నత ప్రతిభను కనపరుస్తూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు జేజేలు అందుకుంటున్నారని నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బా గ్చి పేర్కొన్నారు. . ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శనివారం ఉదయం వీజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 30 మందికి ఇన్స్పైర్ వుమన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ' 'ప్రౌడ్ ఆఫ్ వైజాగ్ అవార్డులతో సత్కరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాగ్చి మాట్లాడుతూ మమతాను రాగాలకు చక్కని చిరునామా మహిళలే అన్నారు. అన్ని రంగాల్లోనూ మగవారితో పోటీ పడుతూ అన్ని వర్గాల ప్రశంసలు అందుకుంటున్నారని అభినందనలు తెలియజేశారు. గౌరవ అతిథిగా హాజరైన జిల్లా పర్యాటక శాఖాధికారిమాధవి మాట్లాడుతూ అంకిత భావం, క్రమశిక్షణ తో కూడిన విధులను నిర్వహిస్తూ సత్ఫలితాల సాధనలో మహిళలు ముందుండడం గర్వకారణం అన్నారు. జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్ సతీమణి దివ్య మాట్లాడుతూ సానుకూల ధృక్పథం అలవరుచుకుంటే విజయాలు సులువుగా చెంత చేరుతాయన్నారు. విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగినప్పుడు మరిన్ని విజయాలు సొంతం చేసుకోవచ్చునన్నారు.. మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉన్నారని గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం అన్ని రకాల స్వేచ్ఛ.. సదుపాయాలు కలిగి ఉండడంతో పాటు స్ఫూర్తిదాయకమైన పాత్ర పోషిస్తున్నారు అన్నారు.. జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మానవుల్లో మహనీయులు మహిళలే అని అభివర్ణించారు. సామాజిక ప్రగతికి మహిళల భాగస్వామ్యం ప్రశంసనీయమైనదన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారిస్వరీయ విశ్వవిద్యాలయం హెచ్. బి.కాలనీ బ్రాంచ్ నిర్వహ కురాలు బి.కె. రామేశ్వరి మాట్లాడుతూ జీవన నావను నడిపించటం నుంచి విశ్వవేదికలపై ప్రగతి ప్రణాళికలను రూపొందించే వరకు మహిళలు తమ నైపుణ్యాన్ని చాటుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ జానపద కొరియోగ్రాఫర్ సీనియర్ జర్నలిస్ట్ ఆర్. నాగరాజ్ పట్నాయక్, కార్పొరేటర్ కందుల నాగరాజు, ప్రముఖ సంఘ సేవకురాలు లక్ష్మి భార్గవి తదితరులు పాల్గున్నారు. ఈ సందర్భంగా" ఇన్స్పైర్ ఆఫ్ ఆంధ్ర ' అవార్డులను బిగ్ బాస్ ఫేమ్ దమ్ము శ్రీజ,ఉపాధ్యాయురాలు హిల్డా మాత్యు (ఎస్ఎఫ్ఎస్ స్కూల్) వి. విజయవేణి (ఏయూ జర్నలిజం శాఖ ), సీతా మహాలక్ష్మి ( సావిత్రి భాయ్ పూలే ట్రస్ట్ ) డి. మాణిక్యంభ ( సీనియర్డ్ జర్నలిస్ట్ ) ప్రౌడ్ ఆఫ్ వైజాగ్ అవార్డులను జర్నలిస్టు జామి వరలక్ష్మి, ఎస్. అనురాధ, రాణి దేవళ్ల, పి. విజయలక్ష్మి, పి. వీర లత, ఎం. శ్రీ దేవిక రాణి, శరా జ్యోతి లకు అందజేశారు. యువ న్యాయ వాదులు చెన్నా ప్రమోధిని, పిళ్ళా జానకి ప్రవల్లిక, డాక్టర్. ఎం. శ్రీ హర్షిత, ఉపాధ్యాయులు డి. దేవి శ్రీ లత, నీరజ మణిభూషణ్ లు అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ చెందిన ఎన్ జోషిత, విష్ణుప్రియ, గీతిక లు చేసిన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# రెవెన్యూ అధికారులకు తెలియకుండా కళ్ళు కప్పి ప్రభుత్వ. గడ్డ పోరంబోకు. అటవీ భూమి. డి పట్టా భూములు. కబ్జా

**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం.భీంపోలు పంచాయితీ. నందకోట రెవెన్యూ గ్రామమునకు సంబంధించిన నేరేడు వలస గ్రామం లో ఆదివాసి గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ గ్రామంలో ఉన్న గిరిజనుల గిరాయితీ భూములపై మైదాన ప్రాంతాలైన నెల్లూరు ప్రాంతాలైన భూ కబ్జాదారులు సొర బడి కొండల్లో కోనల్లో నివసిస్తున్న నిరక్షరాసులైన అమాయక గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని ఎంఎస్ రాజు. సత్యనారాయణ. అను గిరిజన నేతలు గిరిజన ప్రాంతాల్లో సొరపడి గిరిజన భూములు గిరునులకు భయభ్రాంతులను కలిగించి అమాయక నిరీక్ష రాసులైన గిరిజనుల భూములు కబ్జాలు చేస్తున్నారు ఏమిటని అడుగుతే మీకు దిక్కు ఉన్న దగ్గర చెప్పుకోమని నేరేడువలస గ్రామ గిరిజనులపై దౌర్జన్యం చేస్తున్నారని గ్రామ గిరిజనులైన గలవరి పెద్ద రాము. గలవరి సన్యాసి. గలవరి చిన్న రాము. పోయారి పైడితల్లి. పోయారి చిన్నయ్య. జర్నీ రాము. గల వరి పండయ్య. పరదేశి గంగరాజు. గలవరి బుచ్చిరాజు. కోటపర్తి పెంటయ్య. కోటపర్తి గంగులు. పరదేశి కన్నయ్య. పాడి సన్యాసి. పాడి గంగులు. జన్ని పెండయ్య లు శనివారం నాడు స్థానిక విలేకరుల ముందు వాపోయారు ఆ గ్రామ ప్రజలు మాట్లాడుతూ గత పదివేల క్రితం నేరేడువలసి గ్రామంలో వచ్చి పాడి సన్యాసి. పాడి గంగులుల కు సంబంధించిన వ్యవసాయ గిరాయితీ పట్టా భూములు కల్లబొల్లి మాయమాటలు చెప్పి ఆశ చూపించి ఎంఎస్ రాజు. సత్యనారాయణ పేరు మీద 36 ఎకరాముల భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు అదికాక గత ఏడాది అనంతగిరి మండల సర్వేయర్లు గ్రామంలో వచ్చి అటవీ భూములు. డి పట్టా భూములు ప్రభుత్వ భూములు. గడ్డ పోరంబోకు భూములు సర్వే చేసి తులసి నేరేడు వలస గ్రామ గిరిజనులకు 15 మంది గిరి రైతులకు వీఆర్వో. సర్వేర్లు ఆర్ ఐలు వచ్చి



అప్పచెప్పినారు నాటినుండి నేటి వరకు అనంతగిరి రెవెన్యూ అధికారులు సర్వే చేయించి కొలసి ఇచ్చిన భూములు సాగు చేసుకుంటున్నామని అన్నారు ఈ మధ్యకాలంలోనే కృష్ణ. గుంటూరు నెల్లూరు వాసులైన ఎంఎస్ రాజు. సత్యనారాయణ. అనువారు వచ్చి మీరు సాగు చేసుకుంటున్న భూములు కూడా మాకు సంబంధించినవి అనంతగిరి మండల తాసిల్దార్ వారు మాకు అప్పజెప్పినారు అని చెబుతూ ఆ భూములపై యంత్రాలు పెట్టి చదును చేసి ఎటువంటి పర్మిషన్లు లేకుండా మూడు బోర్లు తవ్వించినారు మేమంతా కలిసి వెళ్లి అడుగ్గా మీకు ఎటువంటి సంబంధం లేదు ఆ భూముల జోలికి వస్తే మీకు చంపేస్తాం రౌడీలను గూండాలను పెట్టి చంపేస్తామని దౌర్జన్యం చేసి బెదిరిస్తున్నారు బెదిరించడమే కాకుండా మా నేరేడువలస గ్రామం ఎత్తివేయాలని గ్రామం ఖాళీ చేసి వెళ్లిపోవాలని దౌర్జన్యం చేసి బెదిరిస్తున్నారు ఇప్పటికైనా అనంతగిరి మండల రెవెన్యూ అధికారి. మండల పోలీస్ స్టేషన్ అధికారి. జిల్లా అధికారులు స్పందించి మమ్మి మా గ్రామానికి మా భూములకు రక్షణ కల్పిస్తూ మాపై దౌర్జన్యం చేస్తున్న భూ బకాసురులపై భూ కబ్జుదారులపై ఫోటో రీత్యా చర్యలు తీసుకొని మమ్ములను మా గ్రామానికి మా గ్రామ భూములకు రక్షణ కల్పిస్తారని కోరుచున్నాము




## అల్లు శిరీష్ -నైనిక పెళ్లిలో టాప్ -10 స్టార్లు





మెగా - అల్లు కుటుంబాల్లో మరో వేడుక అంబరాన్నంటింది. అల్లు అరవింద్ కుమారుడు, పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ వివాహం మార్చి 6న నైనిక రెడ్డితో హైదరాబాద్ వేదికగా అత్యంత వైభవంగా జరిగింది. వరుణ్ తేజ్ వివాహ సమయంలో మొదలైన వీరి పరిచయం ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో ఈ శుభకార్యానికి దారితీసింది. శిరీష్ వివాహ వేడుకను మెగా అల్లు కుటుంబాలు ఒక పండుగలా జరుపుకున్నాయి.

ఈ వివాహ వేడుకలో మెగా ఫ్యామిలీ హడావిడి మామూలుగా లేదు. మెగాస్టార్ చిరంజీవి దంపతులు స్వయంగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించగా, అల్లు అర్జున్ తన తమ్ముడి పెళ్లి పనులన్నీ దగ్గరుండి పర్యవేక్షించి అన్నగా తన బాధ్యతను చాటుకున్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ - ఉపాసన దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి సందడి చేశారు. మెగా వారసులు సాయి ధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి పెళ్లి వేడుకలో సందడి చేస్తూ కనిపించారు.

కేవలం మెగా హీరోలే కాకుండా.. టాలీవుడ్, కోలీవుడ్ నుంచి టాప్ స్టార్స్ ఈ వేడుకకు తరలివచ్చారు. అల్లు అరవింద్‌తో ఉన్న సుదీర్ఘ అనుబంధం కారణంగా తమిళ స్టార్ హీరో సూర్య చెన్నై నుండి వచ్చి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇక నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున వంటి అగ్ర హీరోలు ప్రీ-వెడ్డింగ్- పెళ్లి వేడుకల్లో పాల్గొని అల్లు అరవింద్‌తో కలిసి ముచ్చటించడం అందరినీ ఆకట్టుకుంది. నాగచైతన్య, రానా దగ్గుబాటి, రవితేజ వంటి స్టార్ హీరోలు కూడా ఈ వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు.యువతలో విపరీతమైన క్రేజ్ ఉన్న విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న ప్రీవెడ్డింగ్ వేడుకలో హైలైట్‌గా నిలిచారు. ఇదే వేడుకకు నేచురల్ స్టార్ నాని తన భార్య అంజనతో కలిసి రాగా, గోపీచంద్, నవీన్ పోలిశెట్టి, ప్రియదర్శి వంటి నటులు వెన్యూ వద్ద మరింత జోష్‌ను తీసుకొచ్చారు. టాలీవుడ్ ప్రముఖ నటీమణులు మీనాక్షి చౌదరి, రాశీ ఖన్నా, సీనియర్ నటులు మోహన్ బాబు, రాజేంద్ర ప్రసాద్, జగపతి బాబులు నూతన దంపతులకు తమ దీవెనలు అందజేశారు.

భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో- ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ
లి. నెం. 2443, భీమునిపట్నం - 531163 :
Ph No: 96427 26662, 94912 28234

ఎన్నికల ప్రకటన

భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లి నెం. 2443, భీమునిపట్నం యొక్క ఖాళీ అగు ఇద్దరు డైరెక్టర్లుకు తే. 30-03-2026 ది సోమవారం ఉదయం గం. 8.00ల నుండి మధ్యాహ్నం గం. 3.00 ల వరకు భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లి, డోర్. నెం. 4-8, నేరేళ్లవలస కాలనీ, ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల రహదారి, భీమునిపట్నం అవరణములో ఎన్నికలు జరపబడును.

ఎన్నికల ప్రక్రియ :- బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో
నామినేషను ఫారములు స్వీకరణ :- తే. 12-03-2026 ది గురువారం ఉదయం గం.10.00ల నుండి సాయంత్రం గం. 4.00 ల వరకు
నామినేషనులు పరిశీలన :- తే. 13-03-2026 ది శుక్రవారం ఉదయం గం.10.00 ల నుండి సాయంత్రం గం. 4.00 ల వరకు
నామినేషనులు ఉపసంహరణ :- తే. 14-03-2026 ది శనివారం ఉదయం గం.10.00 ల నుండి సాయంత్రం గం. 5.00 ల వరకు

పై తెలిపిన విషయములు సంఘ సభ్యులు అందరకు ఇందు మూలముగా తెలియజేయడమైనది. తదుపరి సమాచారం నిమిత్తం సంఘం పని చేయు వేళలలో సంఘం నుండి తెలుసుకోవలసిందిగా కోరడమైనది.

ఎన్నికల అధికారి
BMACBS Ltd., భీమునిపట్నం.

భీమునిపట్నం
తే. 08-03-2026 ది




## రష్మిక తల్లిదండ్రుల లుక్ వెనుక మీనింగ్



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్) పెళ్లి వేడుకలు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. తాజాగా జరిగిన వీరి వెడ్డింగ్ రిసెప్షన్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది రష్మిక తల్లిదండ్రుల వస్త్రధారణ. సాధారణంగా సెలబ్రిటీల వేడుకలంటే భారీ డిజైనర్ దుస్తులు ఆశిస్తారు..కానీ రష్మిక తల్లిదండ్రులు తమ గిరిజన మూలాలను ప్రతిబింబించేలా అత్యంత సాంప్రదాయబద్ధంగా కనిపించడం చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఫ్యాషన్ మాత్రమే కాదు.. వారి పూర్వీకుల పట్ల ఉన్న గౌరవంగా నెటిజన్లు భావిస్తున్నారు. రష్మిక మందన్న కర్ణాటకలోని -కూర్గ్- (కొడగు) ప్రాంతానికి చెందిన గిరిజన సంతతికి చెందిన యువతి. కొడగు సంస్కృతికి భారతదేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా అక్కడ పురుషులు ధరించే కుప్యా (నలుపు రంగు కోటు వంటి దుస్తులు).. మహిళలు ధరించే కొడవ చీర కట్టు (చీర వెనుక భాగంలో కుచ్చెళ్లు వచ్చేలా కట్టడం) వారి తెగ వీరత్వాన్ని, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని చాటిచెబుతాయి. రష్మిక తల్లిదండ్రులు ఇదే వేషధారణలో రిసెప్షన్‌కు హాజరై తమ వారసత్వాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ రిసెప్షన్‌లో రష్మిక తండ్రి మందన్న మదన్ ధరించిన దుస్తులు కొడవ పురుషుల పరాక్రమానికి చిహ్నం. నడుముకు చుట్టిన ఎరుపు రంగు పట్టు వస్త్రం (చేలే), అందులో అమర్చిన సంప్రదాయ కత్తి (పిచే కత్తి) వారి గిరిజన యోధుల చరిత్రను గుర్తు చేస్తాయి. ఆధునిక కాలంలో కూడా తమ మూలాలను మర్చిపోకుండా.. ఇంతటి ప్రతిష్టాత్మక వేడుకలో ఆ గిరిజన వేషధారణను ధరించడం వారి సంస్కృతి పట్ల ఉన్న మక్కువను తెలియజేస్తోంది. అలాగే రష్మిక తల్లి సుమన్ మందన్న ధరించిన చీర కట్టు శైలి కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొడవ మహిళలు చీరను ముందుకు కాకుండా వెనుక వైపున కుచ్చెళ్లు పెట్టి కడతారు. దీనినే -కొడవ స్టైల్ చీర- అంటారు. కొండ ప్రాంతాల్లో నివసించే వారు కదలికలకు ఇబ్బంది లేకుండా ఉండటానికి పూర్వీకుల నుంచి ఈ పద్ధతిని పాటిస్తున్నారు. ఒక స్టార్ హీరోయిన్ తల్లిగా ఖరీదైన గ్లామర్ దుస్తులు కాకుండా.. తన గిరిజన అస్తిత్వాన్ని ప్రతిబింబించే చీరకట్టులో ఆమె కనిపించడం ఆహుతులను ఆకట్టుకుంది.`ూశ్రీంశీ =ఖుం - చెల్లిని కూడా వంకరగా చూస్తారా మీరు? వరలక్ష్మి ఘాటైన ప్రశ్న! ఈ వేడుక ద్వారా రష్మిక కుటుంబం ప్రపంచానికి ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చింది. ఎంత ఎత్తుకు ఎదిగినా తమ పుట్టిన గడ్డను, కట్టుబాట్లను, గిరిజన సాంప్రదాయాలను గౌరవించాలని వారు నిరూపించారు. గిరిజన సంస్కృతి అంటే వెనుకబాటుతనం కాదు.. అది ఒక గర్వించదగ్గ చరిత్ర అని వారి వస్త్రధారణ నిరూపించింది. విజయ్ - రష్మిక కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న తరుణంలో.. ఇరు కుటుంబాల సంస్కృతుల కలయిక ఈ వేడుకను మరింత అర్థవంతంగా మార్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో -విరోష్- రిసెప్షన్ ఫోటోలు వైరల్ అవుతుండగా.. అభిమానులు రష్మిక తల్లిదండ్రులపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. --తమ మూలాలను మర్చిపోని గొప్ప వ్యక్తులు-- అంటూ కామెంట్స్ చేస్తున్నారు. గిరిజన సాంప్రదాయాన్ని ఇంతటి గ్లామర్ ప్రపంచంలో గౌరవప్రదంగా ఆవిష్కరించడం నిజంగా అభినందనీయం. ఈ పెళ్లి వేడుక కేవలం ఇద్దరు స్టార్ల కలయికగానే కాకుండా.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల మేళవింపుగా నిలిచిపోనుంది.

## అప్పుడు గుండె ఆగినంత పనైంది: శివమ్ దూబే



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో ఆఖరి ఓవర్ వేయమన్నప్పుడు తీవ్ర ఆందోళనకు గురైనట్లు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తెలిపాడు. ముఖ్యంగా ఈ ఓవర్ తొలి రెండు బంతులు వేసే ముందు తన గుండె ఆగినంత పనైందని చెప్పుకొచ్చాడు. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 7 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్ చేరిన సంగతి తెలిసిందే. 254 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ బ్యాటర్ జాకోబ్ బెతెల్ విధ్వంసకర శతకంతో చెలరేగడంతో ఆ జట్టు విజయానికి ఆఖరి ఓవర్‌లో 30 పరుగులు అవసరమయ్యాయి. భారత ప్రధాన బౌలర్ల కోటా పూర్తవ్వడం.. స్పిన్నర్ అయిన అక్షర్ పటేల్ మాత్రమే ఉండటంతో సూర్యకుమార్ యాదవ్ శివమ్ దూబేకు ఆఖరి ఓవర్‌ను అప్పగించాడు. అప్పటి వరకు ఒక్క బంతి కూడా వేయని శివమ్ దూబే నేరుగా ఆఖరి ఓవర్ వేయాల్సి వచ్చింది. ఈ ఓవర్ తొలి బంతికి జాకోబ్ బెతెల్ రనౌటయ్యాడు. ఆ తర్వాత ఒక వైడ్‌తో పాటు మూడు సిక్స్‌లు సమర్పించుకున్నశివమ్ దూబే మొత్తం 22 పరుగులు ఇచ్చుకొని భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శివమ్ దూబే.. ఈ ఓవర్ వేసేందుకు తీవ్ర భయాందోళనకు గురైనట్లు వెల్లడించాడు. 'ఆఖరి ఓవర్ వేసే సమయంలో చాలా భయపడ్డాను. నా హార్ట్ బీట్ అమాంతం పెరిగిపోయింది. ఈ ఓవర్‌లో మొదటి రెండు బంతులు చాలా కీలకమని నాకు తెలుసు. అవే మ్యాచ్ విజేతను నిర్ణయిస్తాయి. అందుకే నేను దాని మీద ఫోకస్ పెట్టాను. ఆ సమయంలో భయానికి గురయ్యాను. వరల్డ్ కప్ సెమీఫైనల్లో చివరి ఓవర్ బౌలింగ్ వేయడం ఎప్పటికీ సవాల్‌తో కూడుకున్న విషయమే. జాకోబ్ బెతెల్ సెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. అలాంటి పరిస్థితుల్లో బౌలింగ్ చేయడం కఠినమని నాకు తెలుసు. ఆత్మవిశ్వాసంతో ఉండాలని, నా సామర్థ్యాలను నమ్ముకోవాలని నాకు నేను గట్టిగా అనుకున్నాను. అలాంటి సమయంలో 10 శాతం ప్రదర్శన చేసినా.. అది చాలా మేలు చేస్తుంది.'అని దూబే పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో శివమ్ దూబే 25 బంతుల్లో 43 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో శివమ్ దూబే రాణిస్తున్నా.. అతని బౌలింగ్ అంటే అభిమానులు జంకుతున్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com